సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శనివారం, 11.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 169
పేజీలు: 12 వెల: రూ. 5

## వామ్మో.. ఇంత మందా?

250 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా..
190 మంది రౌడీషీటర్లకు డ్రగ్స్ పాజిటివ్

03






## 21 శాతం డీఏ పెంపు

**వివరాలు ప్రకటించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

- జనవరి ఒకటో తేదీ నుంచి పెంచిన డీఏ అమలు
- సంతోషం వ్యక్తం చేసిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

09



## మంత్రి వెనక మంత్రి!

### పొంగులేటికి పొగ..

- బీఆర్ఎస్ చేతికి ఆయుధం ఇచ్చిందెవరు?
- గులాబీ బాస్ కు అనుగుణంగా ఓ మంత్రి
- కీలక సమాచారం అంతా అక్కడి నుంచే?
- వరుస ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న బీఆర్ఎస్
- సమాధానం చెప్పుకోలేక మంత్రుల తంటాలు
- సీఎంకు గోడు వెళ్లబోసుకున్న పొంగులేటీ
- ఢిల్లీ చెవిలో వేసిన సీఎం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో రాజకీయాలు మారిపోతున్నాయి. నిన్నటిదాకా పొంగులేటీ భూ కబ్జాలు చేశాడు, అవినీతి చేశాడంటూ వరుస ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ చేతికి ఆయుధం అప్పగించింది క్యాబినెట్ లోని ఓ మంత్రి అని కొత్త ప్రచారం మొదలైంది. పొంగులేటీకి వ్యతిరేకంగా ఉన్న సదరు మంత్రి.. ఆయన చేస్తున్న వ్యాపారులు, అందులో లొసుగులు, భూ పంచాయతీలన్నీ బీఆర్ఎస్ కు చేరవేస్తున్నారట. అంతేకాదు.. స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రిగా పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి ఉన్నప్పటికీ.. భూముల వ్యవహారం పొంగులేటీ చాంబర్ నుంచి సదరు మంత్రి ద్వారా నేరుగా బీఆర్ఎస్ కీలక టీంకు చేరుతోంది. ఇటీవల మంత్రి పొంగులేటీ బీఆర్ఎస్కు కౌంటర్లు ఇస్తున్నా.. మంత్రుల నుంచి ఆ స్థాయిలో సహకారం ఉండటం లేదనేది సుస్పష్టం. దీంతో తనమీద జరుగుతున్న ఈ అంతర్యుద్ధాన్ని సీఎం రేవంత్ కు మంత్రి పొంగులేటి చెప్పుకుని బాధపడినట్లు తెలుస్తోంది. అయితే, ఈ వ్యవహారాన్ని సీఎం కూడా అనుకూలంగా మల్చుకునేందుకు ఢిల్లీకి ఫిర్యాదు చేసినట్లు పార్టీ కీలక నేతలు చెబుతున్నారు.

**ఎవరిది దూకుడు..?**
రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ **మిగతా 02లో**



## జీవన్ రెడ్డితో లాభమెంత?

### అంచనాల్లో బీఆర్ఎస్

### గులాబీ గూటిలో సీనియర్ నేత

సెక్రెటరీ జనరల్ పదవి ఇచ్చే ఛాన్స్?
గతంలో రెండుసార్లు కేసీఆర్పై ప్రత్యక్ష పోటీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంటూ, కష్టకాలంలోనూ పార్టీ జెండా మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్లో చేరారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ను కాంగ్రెస్ లో చేర్చుకోవడం.. మున్సిపల్ ఎన్నికల ముందే ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డిని తీవ్ర అసహనానికి గురిచేసింది. గెలిచిన నేతలను చేర్చుకుంటూ ఓడిన మమ్మల్ని అవమానిస్తారా అంటూ ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన గులాబీ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ఓ ప్రత్యేక శైలి. 1983లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినా **మిగతా 02లో**

### అన్నా.. దేవుడే నన్ను నీ దగ్గరికి పంపాడు

**మీతో కలిసి పని చేసేందుకే ఇక్కడికి వచ్చిన**

- తెలంగాణకు అన్యాయం జరుగుతోంది
- భావోద్వేగానికి లోనయిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కేసీఆర్ తో భేటీ
- జీవన్ బృందానికి బీఆర్ఎస్ నేతల ఘన స్వాగతం

02

## పిట్ట ముట్టాలని మొక్క నాటాడు

- వృక్షవాటికగా ఊరి శ్మశానం
- ఒక సామాన్యుడి అసాధారణ సంకల్పం!
- ఇదో ఉద్వేగమైన నేపథ్యం

03



మనిషి బతికున్నప్పుడు పలకరించే ప్రాణాలు కరువైనా.. కనీసం మరణించాకైనా ఆత్మ శాంతించాలని కోరుకోవడం మన సంప్రదాయం. కానీ, కాంక్రీట్ అడవుల మధ్య కనుమరుగవుతున్న పచ్చదనంతో, ఆఖరి పలకరింపుగా రావాల్సిన 'పిట్ట' కూడా దారి మర్చిపోతోంది. కన్నవారి ఆత్మశాంతి కోసం కొడుకులు తల్లడిల్లుతున్న వేళ.. గీసుకొండకు చెందిన రాజ్ కుమార్ అనే వ్యక్తి ఒక అద్భుతమైన ఆలోచన చేశాడు. శ్మశానవాటికలో ఆయన నాటిన ఒక చిన్న మొక్క, నేడు మహా వృక్షమై వందలాది పక్షులకు ఆవాసాన్నివ్వడమే కాదు.. కడసారి వీడ్కోలు పలికే వేళ మనుషులకు ఓదార్పునిచ్చే నీడగా మారిం ది.

-ముద్ర డెస్క్

## సెల్ఫీ అడిగితే స్మార్ట్‌ఫోన్

### సంజూ శాంసన్ గొప్ప మనసు

- అభిమాని పగిలిన ఫోన్ చూసి చలించిన సంజూ..
- అక్కడికక్కడే రూ. 40 వేల ఫోన్ గిఫ్ట్
- గొప్ప మనసుతో మెప్పిస్తున్న క్రికెటర్
- చిన్న ఘటనతో పెద్ద మనసు చాటుకున్న స్టార్

11



## దొంగ పోలీస్

**కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో రూ. 1.40 కోట్ల స్కాం**




- చనిపోయిన సిబ్బంది పేర్లతో జీతాలు డ్రా చేసిన పోలీస్
- టాస్క్ ఫోర్స్ ఏసీపీ విచారణలో వెలుగుచూసిన బాగోతం
- అక్రమార్కుడిపై కరీంనగర్ వన్ టౌన్ లో క్రిమినల్ కేసులు నమోదు

03

## మావోయిస్టు పార్టీపై నిషేధం ఉండాల్సిందే

- ప్రజలకు మంచి చేయాలంటే ప్రజల్లోనే ఉండాలి
- రాజకీయ పార్టీలు, సాయుధ సంస్థలతో ఏం సంబంధం..?
- తెలంగాణలో పీఎల్‌జీఏ బెటాలియన్ కనుమరుగైంది
- క్రియాశీలక మావోయిస్టు కేడర్ లో ఎవరూ లేరు
- పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు 42 మంది లొంగుబాటు

09

**డీజీపీ శివధర్ రెడ్డి**



## మక్క రైతుకు మద్దతు

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



- కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- ఆర్థిక ఇబ్బంది ఉన్న రైతుకు అండగా ప్రభుత్వం
- రైతులను పట్టించుకోని కేంద్రం
- జీవన్ రెడ్డి పార్టీ మారడం వ్యక్తిగతం
- 2029లో రేవంత్ రెడ్డే సీఎం

06

## దొంగను కొరికిన పిల్లి

09

లాలాగూడ పీఎస్‌లో విచిత్ర కేసు




## కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి


### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి


- అన్ని శాఖలు సమిష్టి, సమన్వయంతో పని చేయాలి
- హైదరాబాద్ మహానగరాన్ని రోల్ మోడల్ గా నిలపాలి
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి
- కేంద్ర పథకాల అమలుపై సమీక్ష

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎం స్వనిధి యోజన, పీఎం విశ్వకర్మ, స్వచ్ఛభారత అభియాన్, పి.ఎం ఆవాస్ **మిగతా 02లో**



రాజస్థాన్‌లోని నాగౌర్‌లో పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని ఎలక్ట్రిక్ కారు(EV)కు ₹1500 ఫైన్ వేయడం చర్చనీయాంశమవుతోంది. ఈవీకి అది అవసరం లేదని కారు ఓనర్ చెప్పినా ఆ పోలీస్ ఆఫీసర్ పట్టించుకోలేదు.





## యవ్వనంగా ఉండాలంటే చక్కెర తగ్గించండి



రిఫైండ్ షుగర్ ఎక్కువగా తీసుకుంటే కొల్లాజెన్ దెబ్బతింటుంది. దీంతో చర్మం ముడతలు పడుతూ త్వరగా వృద్ధాప్యం కనిపిస్తుంది.

# జీవన్ రెడ్డితో లాభమెంత?

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా సొంత ని యోజకవర్గానికి మాత్రమే అంటిపెట్టుకుని ఉన్న అరుదైన నేత. అంతే కాదు ఏ కేసీఆ ర్‌పై రెండు సార్లు పోటీ చేసారో ఇప్పుడు అదే కేసీఆర్ పార్టీలోకి వెళుతుండటం ఆసక్తికర పరిణామం. ఒకప్పుడు ఎవరినైతే ఓడించడానికి తన సర్వశక్తులూ ఒడ్డారో, నేడు అదే నాయకుడి వెనుక నడవడానికి సిద్ధపడ్డారు. జగిత్యాల ప్రజల తలలో నాలుకగా మెదిలి, కాంగ్రెస్ కోటను కాపాడిన తాటిపర్తి జీవన్ రెడ్డి, నేడు గులాబీ కండువా కప్పుకోవడం వెనుక రాజకీయ అవసరాలకు మించిన ఆత్మగౌరవం, అసంతృప్తి దాగి ఉన్నాయి. నిజానికి, జీవన్ రెడ్డి సీనియర్ నేత అయినప్పటికీ.. ఇటీవల వరుస ఓటములు ఆయన ప్రభావాన్ని తగ్గించినట్లుగా మారుతుంది. ఇలాంటి సమయంలో ఆయన కోసం బీఆర్ఎస్ రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం పలికింది.

**సెక్రటరీ జనరల్ పదవి..**

బీఆర్ఎస్ అధిష్టానం జీవన్ రెడ్డికి కేకే వదిలి పెట్టిన సెక్ర టరీ జనరల్ వంటి కీలక పదవిని ఆఫర్ చేసినట్లు తెలు స్తోంది. పార్టీలో కేసీఆర్ తర్వాత అంతటి ప్రాధాన్యత ఉన్న పదవిని, కొత్తగా వచ్చిన వ్యక్తికి కట్టబెట్టడంపై మొదటి నుండి కారు పార్టీని నమ్ముకున్న సీనియర్లలో అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా పార్టీని అంటిపెట్టుకున్న ఇతర ఉమ్మడి కరీంనగర్ నేతలను పక్కనపెట్టి, నిన్నటిదాకా తమను తిట్టిన నేతకు రెడ్ కార్పెట్ వేయడం ఏమిటని కొందరు నేతలు అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో నాయకత్వ పోరు**

జీవన్ రెడ్డి రాకతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాయక త్వ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే జిల్లాలో గంగుల కమలాకర్ వంటి బలమైన నేతలు ఉం డగా, ఇప్పుడు జీవన్ రెడ్డి వంటి దిగ్గజం చేరడం ఆధి పత్య పోరుకు దారితీయవచ్చు. ముఖ్యంగా జగిత్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పుడు ఎవరి కింద పనిచేయాలన్న గందరగోళంలో ఉన్నాయి. నిన్నటిదాకా కొట్టుకున్న వర్గాలు ఇప్పుడు ఒకే జెండా కింద ఎలా కలిసి సాగుతాయన్నది పెద్ద ప్రశ్న. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి ఉన్న వ్యక్తిగత ఇమేజ్ బీఆర్ఎస్‌కు బలంగా మార వచ్చు కానీ, అది పాత క్యాడర్‌లో చీలిక తెచ్చే ప్రమాదం ఉంది. సంజయ్ కుమార్ వైఖరికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తుండటంతో, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు రెండు గ్రూపులు గా విడిపోయే అవకాశం ఉంది.

**ఇటీవలి కాలంలో గెలవని జీవన్ రెడ్డి**

ఎన్నో అవకాశాలు వచ్చినా గెలవని జీవన్ రెడ్డిని చేర్చుకోవడం వల్ల పార్టీకి లాభమా లేక నష్టమా అనే చర్చ బీఆర్ఎస్‌లో జరుగుతున్నా, ఆయన అనుభవం పార్టీకి అవసరమని అధిష్టానం గట్టిగా నమ్ముతోంది. అయితే, ఈ నిర్ణయం కరీంనగర్ గులాబీ తోటలో ముళ్లు జల్లినట్టే అవుతుందన్నది విశ్లేషకుల అంచనా. జీవన్ రెడ్డికి అంత ప్రజాబలం లేదని.. అయనకు బదులుగా యువనేతల్ని ప్రోత్సహిస్తే మంచిదని.. గతంలో కేకేను ప్రోత్సహిస్తే ఏం జరిగిందో తెలుసుకదా అని ప్రశ్నిస్తున్నారు.

**రెండు సార్లు కేసీఆర్ పై పోటీ..**

తెలుగు రాష్ట్రాల రాజకీయాలు తెలిసిన ఎవరికైనా జీవన్ రెడ్డి పేరు సుపరిచితం. నేటి ధిగ్గజ నేతలు కేసీఆర్, చంద్రబాబు సమకాలికుడే కాదు, 1983లోనే ఎమ్మెల్యే.. యువ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ గడ్డుకాలంలో చాలా సందర్భాల్లో జీవన్ రెడ్డి గెలిచి తన ప్రత్యేకత చాటుకున్నారు. అంతే కాదు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ కేసీఆర్ సెంటిమెంటును కొనసాగించేందుకు రాజీనామాలు, ఉపఎన్నికల ఎత్తుగడలు వేసేవారు అలా 2006, 2008 కరీంనగర్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కేసీఆర్ పై కాంగ్రెస్ తరపున పోటీకి నిలిచారు. మొదటి సారి రెండు లక్షల ఓట్లతో కేసీ ఆర్ గెలిచినా.. 2008లో మాత్రం వైఎస్ సహకారంతో జీవన్ రెడ్డి కేసీఆర్‌కు ముచ్చెమటలు పట్టించారు. కరీంనగర్ లో తనకు ఎదురు లేదనుకున్న గులాబీ నేతను దా దాపు ఓటమి అంచుల దాకా నెట్టి కేవలం 15వేల మెజారిటీ మాత్రమే ఇచ్చారు. కానీ, కాలక్రమేణా పరిస్థితులు మారాయి. నేడు అదే కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ, 'ప్రజలు కోరిన దానికంటే ఎక్కువే చేసిన ఏకైక నాయకు డు కేసీఆర్' అని జీవన్ రెడ్డి కీర్తించే దాకా పరిణామాలు మారాయి. శత్రువు నుంచి మిత్రుడిగా మారిన ఈ ప్రస్థానం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

**కార్పొరేట్ రాజకీయాలకు దూరం**

జీవన్ రెడ్డి అంటే సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి ఉదాహరణ. ఆయన ఇల్లు, ఆఫీసు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఆధునిక కార్పొరేట్ రాజకీయాల హంగులు ఆయన దరిచేరలేదు. ఆయన ఆఫీసు డెస్కు దశాబ్దాల నాటి పాత శైలిలో ఉంటుంది. అత్యంత సాధారణంగా ఉండే ఆ గదిలోనే వేల మందిని ప్రతిరోజూ కలుస్తుంటారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఆయన జీవనశైలి మారలేదు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే 'ఓపెన్ డోర్' పాలసీ ఆయనది. గల్ఫ్ బాధితులైనా, స్థానిక పేదలైనా ఆయన వద్దకు వెళ్లి కష్టాలు తీర్చమని అడుగుతారు. ఇంటికి వచ్చిన వారికి పప్పు, పచ్చిపులుసు, మామిడికాయ తొక్కుతో 'సింపుల్ లంగర్' దశాబ్దాలుగా వడ్డిస్తున్నారు. వైఎస్ హయాంలో అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ సాధించుకున్న నేత కూడా జీవన్ రెడ్డి గారే.

**ఢిల్లీ క్యూలైన్లకు వ్యతిరేకం**

కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పర్యటనలు, 10 జనపథ్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు సర్వసాధారణం. కానీ, జీవన్ రెడ్డి శైలి వేరు. ఆయన ఎన్నడూ పదవుల కోసం ఢిల్లీ వీధుల్లో లాబీయింగ్ చేయలేదు. తనకు ప దవి రావాలన్నా, పోవాలన్నా అది తన పనితీరు మీద ఆ ధారపడాలే తప్ప హైకమాండ్ ప్రదక్షిణల వల్ల కాదన్నది ఆయన నమ్మకం. తన నియోజకవర్గమే ఢిల్లీ, ప్రజలే హైకమాండ్ అన్నట్లుగా సాగుతారు. ఇప్పుడు రేవంత్ తో వైరం కూడా ఆ ఆత్మగౌరవ ప్రతిష్టతోనే వచ్చిందని చెబుతారు.



**రేవంత్ శైలిపై తీవ్ర అసంతృప్తి**

42 ఏళ్ల పాటు పార్టీతో నడిచి నేడు వీడటానికి జీవన్ రెడ్డి చెప్పిన కారణాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. 'తెలంగాణ ప్రజలు మార్పు కోసం ఆశపడి ఓటేశారు, కానీ నేడు నిరాశకు గురవుతున్నారు.' అని ఆయన చేసిన విమర్శలు చాలా ఘాటైనవి. ఫిరాయింపుల రాజకీయాలను ప్రోత్సహించడం, సీనియర్లకు గౌరవం ఇవ్వకపోవడం వంటి అంశాలు ఆయ న ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 2014లో ఒంటరి పోరాటం చేసి గెలిచిన తనకు, నేడు సొంత పార్టీలోనే గుర్తింపు కరువైందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవన్ రెడ్డిని కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించింది. 2018 లో ఓడిపోతే ఎమ్మెల్సీని చేసింది. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో మంత్రిని చేసింది. మొత్తం 14 సార్లు జీవన్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. బుజ్జగించేందు కు జాతీయ నేతలు, పీసీసీ అధ్యక్షులతో సహ అందరూ ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ లో కొనసాగాలని కోరా రు. కేవలం ఒకరితో అభిజాత్యానికి పోయి తల్లిలాంటి పార్టీని వీడటం సరికాదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ లాంటి కుటుంబ పార్టీలోకి వెళ్తే కేసీఆర్ ప్రేమలు ఎప్ప టికీ ఉండవని హెచ్చరిస్తున్నారు.

## అన్నా.. దేవుడే నన్ను నీ దగ్గరికి పంపాడు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ అసంతృప్త నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు. జీవన్ రెడ్డిని చూడగానే కేసీఆర్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరం వచ్చిందని జీవన్ రెడ్డి చెప్పారు. మీతో కలిసి పని చేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండని వ్యాఖ్యానించారు. చాలా ఏండ్ల తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మనసులోని మాటను వ్యక్తం చేస్తూనే జీవన్ రెడ్డి తన కళ్ల వెంట నీళ్లు పెట్టుకున్నారు. దీంతో కేసీఆర్ వెంటనే ఆయన్ను అనునయిస్తూ, అప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. ఆలింగనం చేసుకున్నారు. అనంతరం జీవన్ రెడ్డిని శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరిద్దరు కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నతర్వాత కేసీఆర్.. జీవన్ రెడ్డి బృందానికి మధ్యాహ్న భోజన ఆతిథ్యం ఇచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ భేటీలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే డా. కె. సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# మంత్రి వెనక మంత్రి..!

(మొదటి పేజీ తరువాయి)

మధ్య అవినీతి అస్త్రాల యుద్ధం పతాక స్థాయికి చేరింది. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా హరీష్ రావు, కేటీఆర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ మంత్రుల స్పందన కేవలం డిఫెన్సివ్‌గా మాత్రమే ఉందని, బలమైన కౌంటర్ ఇవ్వడంలో వారు వెనుకబడిపోతున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో వరుస విమర్శలతో బీఆర్ఎస్ వేగం పెంచితే.. అవకాశం వచ్చినప్పుడు ఏదో నాలుగు మాటలు తిట్టి అధికార పక్షంలో జబ్బలు చరుచుకుంటోంది.

**బీఆర్ఎస్ పొంగులేటి అస్త్రం**

బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా మంత్రి పొంగులేటిని ముందు పెట్టి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ప్రధానంగా నాదర్‌గుల్ భూముల్లో 7,000 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇందులో మంత్రి కుటుంబానికి చెందిన సంస్థల ప్రమేయం ఉందని హరీష్‌రావు ఆరోపించారు. దీనికి తోడు రాఘవ కన్స్ట్రక్షన్స్ ద్వారా అక్రమ మైనింగ్ సాగిస్తున్నారని, కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టుల్లో అక్రమాలు జరిగాయని కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఆరోపణలు కేవలం ఒక మంత్రికి పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ఈ వివాదాల్లోకి లాగుతూ బీఆర్ఎస్ మైలేజ్ పొందుతోంది.

**కౌంటర్ ఇవ్వలేని క్యాబినెట్**

బీఆర్ఎస్ చేస్తున్న నిర్దిష్టమైన ఆరోపణలకు కాంగ్రెస్ మంత్రులు ఇస్తున్న సమాధానాలు చాలా బలహీనంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి, ఇతర మంత్రులు ఈ ఆరోపణలను నిరాధారమైనవి అని కొట్టిపారేసినప్పటికీ, ప్రజల్లోకి బలమైన సంకేతం పంపడంలో విఫలమయ్యారన్న అంచనాలు వస్తున్నాయి. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఈ ఆరోపణలు చేస్తున్నారు ఒకే మాటను వారు పదే పదే చెబుతున్నారు. దీనివల్ల ప్రస్తుత ఆరోపణలపై స్పష్టత ఇవ్వడం కంటే, పాత విషయాలను తోడటం పైనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

**సమన్వయ లోపం - ఒంటరి పోరాటం**

బీఆర్ఎస్ నాయకత్వం ఒక టీమ్‌గా విరుచుకుపడుతుంటే, కాంగ్రెస్ వైపు నుండి కేవలం పొంగులేటి మాత్రమే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇతర కీలక మంత్రులు ఈ వివాదాల జోలికి వెళ్లకపోవడం లేదా అరకొరగా స్పందించడం వల్ల ప్రభుత్వం డిఫెన్స్ లో పడిపోయిందనే భావన కలుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఉండటం, ఇక్కడ మంత్రుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు ప్రజల మెదళ్లలోకి బలంగా వెళ్తున్నాయి. మైనింగ్ ఆదాయంపై బీఆర్ఎస్ లేవనెత్తిన సాంకేతిక అంశాలకు ప్రభుత్వం నుండి పక్కాగా సమాధానం రావడం లేదు. ఇసుక ధరలు పెరిగాయని, ఆదాయం ఎందుకు తగ్గింది? అనే ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పలేక, దానిని చిన్న విషయంగా కొట్టిపారేయడం విమర్శలకు తావిస్తోంది. సీఐడీ విచారణకు ఆదేశించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సిట్టింగ్ మినిస్టర్‌పై సీఐడీ విచారణ ఎలా నిష్పక్షపాతంగా జరుగుతుంది అనే ప్రతిపక్షాల ప్రశ్నకు మంత్రుల దగ్గర గట్టి సమాధానం లేదు.

**అసలు సాయం చేస్తున్నదెవరు..?**

ఇప్పుడు మరో ప్రధాన చర్చ ఏమిటంటే.. క్యాబినెట్‌లో జరిగే కీలక విషయాలన్నీ బీఆర్ఎస్ కీలక నేతలకు ముందుగానే తెలిసిపోతున్నాయి. ఇదంతా ఒకవైపు ఉంటే.. మంత్రులు చేసే రోజువారీ చర్చలు కూడా గులాబీ దళానికి చేరుతున్నాయి. ఒక్కో మంత్రి ఏం చేస్తున్నాడు. ఎక్కడెక్కడ ఏమేం మాట్లాడుతున్నాడు అనే వివరాలు కూడా బీఆర్ఎస్ చెవిలో పడుతున్నాయి. అంటే కీలక నిఘా వ్యవస్థను బీఆర్ఎస్ బలపర్చుకుందని స్పష్టమవుతోంది. అంతేకాదు.. పొంగులేటీ వ్యవహారంలో ఒక మంత్రి కీలకంగా ఉండి.. ఈ లీకులు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**నష్టం కాంగ్రెస్ కే..?**

నిజానికి, రెండున్నరేండ్ల ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలవుతోంది. హామీల అమలు ఓవైపు ఉంటే.. క్యాబినెట్లో విభేదాలు, బహిరంగ విమర్శలు, ఇటు బీఆర్ఎస్ పక్కా విమర్శలు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా మారుతున్నాయి. రాజకీయంగా బీఆర్ఎస్ ఇప్పుడు అటాకింగ్ మోడ్‌లో ఉంది. కాంగ్రెస్ మంత్రులు కేవలం ఆరోపణలు నిరూపించండి.. నేను రాజీనామా చేస్తా వంటి పాత డైలాగులతో కాకుండా, డేటా, డాక్యుమెంట్లతో కూడిన కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. లేకపోతే, ఈ అవినీతి ముద్ర ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా పాలనలో పారదర్శకత ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్, ఇలాంటి ఆరోపణల సమయంలో మరింత వేగంగా ,బలంగా స్పందించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరిగే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.






# కేంద్ర పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

యోజన, పీఎం ముద్ర లోన్స్, స్టాండ్ ఆఫ్ ఇండియా, పీఎం జన్ ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, సమగ్ర శిక్ష అభియాన్, పీఎంశ్రీ, పీఎం కౌశల్ వికాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, వయా వందన యోజన, స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

హైదరాబాద్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సహా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికల ఆరోగ్య రక్షణ కోసం 14 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. అలాగే తలసేమియా రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యా రుణాల పంపిణీని మరింత పెంచాలని బ్యాంకులకు సూచించారు. హైదరాబాద్ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, దాని బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్, కాలుష్యం, నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఫ్లైఓవర్లు, రహదారుల నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్య ఘర్ పథకాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశించిన మంత్రి, జిల్లాకు కేంద్ర నిధులు తీసుకురావడంలో తాను బాధ్యత వహిస్తానన్నారు. సమావేశంలో అధికారులు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు.



# తెలంగాణలో కాంగ్రెస్ పతనం మొదలైంది

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**పార్టీ, ప్రభుత్వం తిరోగమనంలో పయనిస్తున్నాయి**

**కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు**

**మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో కాంగ్రెస్ పతనం మొదలైందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజల నాడి మారుతోందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు, మళ్లీ కేసీఆరే సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ మాత్రమే కాదు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తోందని జీవన్ రెడ్డి విశ్లేషించారు.రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులు ఖాయమని జీవన్ రెడి జోస్యం చెప్పారు. శుక్రవారం ఎర్రవెల్లిలో కేసీఆర్ తో భేటీ తర్వాత ఆయన బయట మీడియాతో మాట్లాడారు. తెలంగాణపై కాంగ్రెస్ హైకమాండ్ (ఏఐసీసీ) పట్టు కోల్పోయిందని విమర్శించారు. ఒకప్పుడు పీసీసీ ఏది చెబితే సీఎంలు అదే చేసేవారన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడే ఏకపక్షంగా 'రూలర్'లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పీసీసీ అనేది కేవలం సీఎం ఆదేశాలను అమలు చేసే ఒక విభాగంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ చేసే తప్పులకు ఏఐసీసీ ని నిందించడం సరికాదన్నారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**యవ్వనంగా ఉండాలంటే వేయించిన ఆహారాలకు దూరంగా ఉండండి**

ఫ్రైడ్ ఫుడ్స్‌లో ఫ్రీ రాడికల్స్ ఏర్పడి కణాలను దెబ్బతీస్తాయి.
ఇవి చర్మం మెరుపును తగ్గించి ముసలితనం త్వరగా తెస్తాయి.





## చేనేత కార్మికులను ప్రోత్సహించాలి

- **చేనేత సంఘాల వినతి**

**ముద్ర, హైదరాబాద్:**


రాష్ట్రంలో చేనేత కార్మికులకు ప్రోత్సాహం కల్పించే దిశగా టెండర్లను రద్దు చేసి సహకార సంఘాల ద్వారా బెడ్‌షీట్లు, దరీస్ కొనుగోలు చేయాలని చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్, చేనేత దినోత్సవ రూపకర్త ఎర్రమాద వెంకన్న నేత, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కా దేవదాసు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ నాయకుడు కర్నాటి మనోహర్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాసాబత్తిని రాజేశం, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చేనేత రంగ సమస్యలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ కొనుగోలు విధానాలపై గంటకు పైగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 26-27 లక్షల విద్యార్థులకు 23 రకాల వస్తువులతో కూడిన కిట్లు పాఠశాల ప్రారంభం రోజున అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కిట్లలో పెన్, పెన్సిల్, బ్యాగ్, షూస్‌తో పాటు ఇతర అవసరమైన వస్తువులు ఉంటాయని తెలిపారు. చేనేత కార్మికుల వద్ద ఉన్న స్టాక్‌ను 2026 మే 15 వరకు పూర్తిగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. "మీరు ఎంత సరఫరా చేయగలరో అంత తీసుకుంటాం. మిగతా అవసరాన్ని మాత్రమే బయట నుంచి సమకూర్చుకుంటాం" అని స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైతే జియోట్యాగ్ ఉన్న కార్మికులకు నెలకు రూ.10,000 వరకు ఆర్థిక సహాయం అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలపై త్వరలో విస్తృతంగా చర్చిస్తామని హామీ ఇచ్చారు.

# పిట్ట ముట్టాలని మొక్క నాటాడు..

- **ఊరి స్మశానాన్ని వృక్షవాటికగా మార్చాడు..!**
- **ఇది ఒక సామాన్యుడి అసాధారణ సంకల్పం..!**
- **ఇదో ఉద్వేగమైన నేపథ్యం**

**ముద్ర డెస్క్:**



మొక్క అనేది చిన్న పరిమాణంలోనే ఉంటుంది. అది పెరుగుతూ వృక్షం లాగా మారుతుంది. వృక్షమైన తర్వాత ఎన్నో రకాలుగా పర్యావరణానికి ఉపయోగపడుతుంది. పిట్టల నుంచి మొదలు పెడితే సేదదీరే మనుషుల వరకు ప్రతి ఒక్కరికీ చెట్టు అనేది పరోపకారిగా ఉంటుంది. అందుకే తరువును మించిన సహాయము.. చెట్టును మించిన ఉపకారము ఈ ప్రపంచంలో ఎవరూ చేయలేరని అంటారు. ప్రస్తుతం అభివృద్ధి అనే మాయలో మనిషి పడిపోయాడు. అందువల్లే చెట్ల సంఖ్య తగ్గిపోతుంది. చెట్ల ఆధారంగా ఉండే వ్యవస్థ కూడా నాశమైపోతోంది. దీనివల్ల జరుగుతున్న పరిణామాలను చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. అందులో వరంగల్ జిల్లా గీసుకొండ ప్రాంతానికి చెందిన వీరగోని రాజ్ కుమార్ కూడా ఉన్నారు. ఈ పరిస్థితిని ఎలాగైనా మార్చాలని ఆయన అనుకున్నారు. దానికి తగ్గట్టుగానే ఒక ఆలోచన చేశారు. అతడు చేసిన ఆ ఆలోచన అందరితోనూ చప్పట్లు కొట్టిస్తోంది.

ఒక మనిషి కాలం చేస్తే తెలంగాణ సాంప్రదాయం ప్రకారం మూడు, ఐదు రోజుల్లో పక్షికి వేస్తారు.. పదో రోజు దినం చేస్తారు. ఈ మూడు రోజులు కూడా పక్షులకు ఆహారం పెట్టడం సర్వసాధారణం. ఆహారం వండి పెట్టడం ద్వారా పక్షుల రూపంలో చనిపోయిన వ్యక్తి వచ్చి తింటాడని ఒక బలమైన నమ్మకం. బలగం సినిమా కూడా ఇదే నేపథ్యంతో రూపొందింది. అయితే చెట్లు లేకపోవడం వల్ల పక్షులు రావడం లేదు. దీంతో పిట్టకు పెట్టె ప్రక్రియలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీనిని గమనించిన రాజ్ కుమార్ ఒక వినూత్నమైన ఆలోచనకు శ్రీకారం చుట్టాడు.

గీసుకొండలో స్మశాన వాటికలో చెట్లు కనిపించకపోవడంతో రాజ్ కుమార్ లో ఆలోచన పెరిగింది. అతనికి వచ్చిన ఆలోచన మొక్కను పెంచే విధంగా చేసింది. రాజ్ కుమార్ స్మశాన వాటికలో మొక్కను పెంచాడు. అది కాస్త వృక్షంగా మారిపోయింది.. ఆ వృక్షం మీద పిట్టలు నివాసం ఉండడం మొదలుపెట్టాయి. ఫలితంగా ఎవరైనా చనిపోతే పిట్టకు వేసే ప్రక్రియ నికరాటంకంగా సాగిపోతోంది. రాజ్ కుమార్ స్మశాన వాటికలో నాటిన ఒక మర్రి మొక్క పెద్ద వృక్షంగా మారింది. దానిని ఆలవాలంగా చేసుకొని అనేక పక్షులు నివసిస్తున్నాయి. అంతేకాదు అంత్యక్రియల కోసం వచ్చిన వారు ఆ చెట్టు నీడన సేద తీరుతున్నారు.

"పిట్ట ముట్టడం అనేది తెలంగాణలో ఒక సాంప్రదాయం. పిట్ట ముట్టకపోతే చనిపోయిన వారి ఆత్మ శాంతించలేదని అర్థం. మా స్మశాన వాటికలో చెట్లు అసలు లేవు. అందువల్లే 2015లో ఒక మర్రి మొక్కను నాటాను. అది కాస్త పెద్ద వృక్షం లాగా మారింది. ఇక అనేక మొక్కలు నాటితే అవి కూడా చెట్లు అయ్యాయి. వాటి మీద పక్షులు జీవిస్తున్నాయి. అందువల్లే పిట్టముట్టే కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని" రాజ్ కుమార్ చెబుతున్నాడు.

# పార్టీ మారడం జీవన్ రెడ్డి వ్యక్తిగత నిర్ణయం

- **ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేస్తాం**
- **రేవంత్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారు**
- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర న్యూస్, కోరుట్ల/మెట్ పల్లి:**



మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారడం ఆయన వ్యక్తిగత నిర్ణయమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీతో అనేక సంవత్సరాలుగా అనుబంధం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా జీవన్ రెడ్డిని స్వయంగా కలిసి పార్టీ మారవద్దని కోరినట్లు తెలిపారు. వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీ రామ్ సాగర్ వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు.

కేసీఆర్ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి మర్చిపోయారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఒక్క హామీని కేసీఆర్ నిలబెట్టుకోలేదని ఆరోపించారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామని మోసం చేశారని విమర్శించారు. దళితులను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి తీరుతామని తీరుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అండతో 2029లో సైతం రేవంత్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చేయించాల్సిన పనులను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## పాలమూరు ప్రాజెక్టులపై హరీశ్ ది ద్వంద్వ నీతి

- **బీఆర్ఎస్ పాలనలోనే గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి జీవోలు**
- **కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను రాసింది కేసీఆరే**
- **మీడియాతో మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ద్వంద్వ నీతిని అవలంబిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వమే గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి జీవోలు ఇచ్చి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డు తగలుతోందని విమర్శించారు. శుక్రవారం సీఎల్పీలో ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016లో 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.4,177 కోట్లతో జీవో ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జూపల్లి గుర్తు చేశారు. 2019 మార్చిలో గొల్లపల్లితో సహా 27 రిజర్వాయర్లను ప్రతిపాదించి, ఇప్పుడు అదే ప్రాజెక్టు వద్దని మాట్లాడటం పాలమూరు ప్రజలను వంచించడమే అన్నారు. కృష్ణా జలాల్లో 811 టీఎంసీ నీళ్లు ఉభయ రాష్ట్రాలకు కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే.. కేసీఆర్ సంతకం చేసి అన్యాయం చేశారన్నారు. శ్రీశైలంలో నీళ్లు లేని సమయంలో వాడుకోవడానికి రిజర్వాయర్లు అవసరమని గతంలో తాము మొత్తుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు.

**పాలమూరు రంగారెడ్డి పనులపై అవాస్తవాలు**

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. రూ. 80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ. 25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదు, భూసేకరణ లేదు, పరిపాలనా అనుమతులు లేవు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. 50 టీఎంసీల మల్లన్న సాగర్ కోసం రైతులను ఈడ్చి పారేసి ప్రాజెక్టు కట్టిన హరీశ్‌రావుకు పాలమూరు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ప్రతిపక్షాలది బురద రాజకీయం

- **వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం**
- **రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ముద్ర, ఖమ్మం:**

ప్రతిపక్షాలది బురద రాజకీయం అని, ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదను అధికార పార్టీకి, నాయకులకు అంటించాలని చూస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో రూ. 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను మంత్రి ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామన్న ఆయన ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దొంగ పోలీస్



- **కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో రూ. 1.40 కోట్ల స్కాం**
- **చనిపోయిన సిబ్బంది పేర్లతో జీతాలు డ్రా చేసిన పోలీస్**
- **టాస్క్ ఫోర్స్ ఏసీపీ విచారణలో వెలుగుచూసిన బాగోతం**

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో భారీ కుంభకోణం బట్టబయలైంది. గతంలో పేసెక్షన్‌లో పనిచేసిన ఒక పోలీసు ఉద్యోగి కమిషనరేట్ కార్యాలయంలో మరణించిన సిబ్బంది పేర్లతో జీతాలు డ్రా చేశాడు. ముగ్గురు కానిస్టేబుళ్ల పేరిట ఏకంగా రూ.1,40,18,308 కాజేశాడు. ఈ భారీ కుంభకోణంపై అనుమానం వచ్చి విచారణ చేపట్టిన టాస్క్ ఫోర్స్ ఏసీపీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిగ్గు తేల్చారు. సదరు ఉద్యోగి మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఎంప్లాయీ ఐడీలను దుర్వినియోగం చేసి ఇన్టిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సమాచార వ్యవస్థ (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో ఇతరుల పేర్లను చేర్చాడు. ప్రైవేట్ బ్యాంకుల్లో నకిలీ ఖాతాలు తెరిచి, తన వ్యక్తిగత మొబైల్ నంబర్లను అనుసంధానించాడు. ఈ క్రమంలో 2022 నుండి 2026 వరకు ప్రభుత్వ జీతాల సొమ్మును అక్రమంగా కాజేశాడు. అక్రమంగా పొందిన నిధులతో వ్యక్తిగత రుణాలు తీసుకోవడంతో పాటు నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు బాధ్యుడైన పోలీసు ఉద్యోగిపై కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

## వామ్మో.. ఇంత మందా?..

- **హైదరాబాద్ సిటీలో రౌడీషీటర్లకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు**
- **250 మందిలో 190 మంది రౌడీషీటర్లకు పాజిటివ్**

**ముద్ర డెస్క్ :**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రెగ్యూలర్‌గా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పోలీసులు ఒక భారీ ఆపరేషన్ చేపట్టారు. సిటీ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, వారిలో డ్రగ్స్ అలవాట్లు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీలు నగరంలోని నేరస్తులకు వణుకు పుట్టిస్తున్నాయి. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరం మొత్తం మీద సుమారు 1300 మంది రౌడీ షీటర్లను గుర్తించారు. వీరిలో ప్రాథమికంగా 250 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 250 మందిలో ఏకంగా 190 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం కలకలం రేపుతోంది. అంటే దాదాపు 75 శాతం మంది రౌడీ షీటర్లు మత్తు పదార్థాలకు బానిసలయ్యారని స్పష్టమైంది. వీరిలో అత్యధిక శాతం మంది గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. రౌడీ షీటర్లు మత్తులో ఉండి తీవ్రమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వీరికి గంజాయి ఎక్కడి నుండి సరఫరా అవుతోంది..? దీని వెనుక ఉన్న ప్రధాన నెట్‌వర్క్ ఏమిటి..? వీరు డ్రగ్స్, గంజాయి ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గుట్టలో శ్రీ ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

- **స్వామివారి నిత్య రాబడి రూ.11.45 లక్షలు**

**ముద్ర, యాదగిరిగుట్ట:**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఊంజల్ సేవను ఆలయ వీధుల్లో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ నిత్య రాబడిలో భాగంగా శుక్రవారం రూ.11,45,649 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు, కిరణ్ కుమార్ చార్యులు మురళి కుమార్ చార్యులు, ఇన్చార్జి చంద్రమౌళి, కొమ్మగాని కుమార్ ఎస్పీఎఫ్ సిబ్బంది పాండు మురళి భక్తులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 11.04.2026

4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## కేరళలో గెలుపు ఎవరిది?



భారతదేశ రాజకీయ పటంలో కేరళ ఒక అసాధారణ ప్రయోగశాల. దశాబ్దాలుగా ఎర్రజెండాకు, హస్తం పార్టీకి మధ్య మారుతూ వస్తున్న అధికారం ఈసారి సరికొత్త సమీకరణాల సుడిగుండంలో చిక్కుకుంది. కేరళ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక స్పష్టమైన త్రిముఖ పోటీ ఛాయలు కనిపిస్తుండటం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (LDF), యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (UDF)ల మధ్య సాగే 'ద్వైపాక్షిక సమరం' కాస్తా, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్‌డీఏ రాకతో త్రిముఖ వ్యూహంగా రూపాంతరం చెందింది. ఈ మార్పు కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన 'రహస్య పొత్తు' ఆరోపణలకు వేదికైంది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంధించిన విమర్శనాస్త్రాలు కేరళ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించాయి.సాధారణంగా కేరళ ఓటరు ఒక కూటమికి వరుసగా రెండోసారి అవకాశం ఇవ్వడం అరుదు. కానీ పినరయి విజయన్ నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) ప్రభుత్వం పదేళ్లుగా అధికారాన్ని అనుభవిస్తూ, మూడోసారి కూడా పాగా వేయాలని చూస్తోంది. ఈ పరంపరలో ఎదురవుతున్న అవినీతి ఆరోపణలు, కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా వంటి అంశాలు పినరయి సర్కార్‌ను ఇరకాటంలో నెట్టాయి. అయితే, ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేరళలోని వామపక్ష నాయకులపై సాఫ్ట్ కార్నర్ ప్రదర్శిస్తోందని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణ ఒక సంచలనం. దేశవ్యాప్తంగా విపక్ష నేతలను జైలుకు పంపుతున్న ఈడీ, సీబీఐలు.. కేరళ ముఖ్యమంత్రి విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నాయి అన్న ప్రశ్న ఇప్పుడు సామాన్య ఓటరు మదిలో కూడా మెదులుతోంది. ఇది కేవలం కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి బీజేపీ, సీపీఐ(ఎం)లు పన్నిన వ్యూహమని, వారి మధ్య ఒక లోపాయికారీ అవగాహన కుదిరిందని రాహుల్ బలంగా వాదిస్తున్నారు.ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ వ్యూహం కూడా అత్యంత వ్యూహాత్మకంగా కనిపిస్తోంది. కేరళలో బలపడటం ద్వారా అటు వామపక్షాల హిందూ ఓటు బ్యాంకును, ఇటు కాంగ్రెస్ క్రైస్తవ ఓటు బ్యాంకును చీల్చడమే ఆ పార్టీ ప్రధాన లక్ష్యం. ఒకవేళ బీజేపీ గణనీయంగా ఓట్లను సాధించగలిగితే, అది సహజంగానే రెండో స్థానంలో ఉండే కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ అవుతుంది. ఇదే తరుణంలో మైనారిటీల రక్షకుడిగా తామే ఉన్నామని చెప్పుకునే లెఫ్ట్ ఫ్రంట్, బీజేపీతో రహస్య ఒప్పందం చేసుకుందన్న ప్రచారం మైనారిటీ ఓటర్లలో అయోమయాన్ని సృష్టిస్తోంది. ఈ గందరగోళం ఎవరికి వరంగా మారుతుందనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన అంశం. మతపరమైన ధ్రువీకరణ (Polarization) మరియు రాజకీయ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టే ధోరణి కేరళ వంటి చైతన్యవంతమైన రాష్ట్రంలో ఎంతవరకు చెల్లుబాటు అవుతుందనేది సందేహమే. మరోవైపు, పినరయి విజయన్ ఈ ఆరోపణలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి బి-టీమ్ అని విమర్శిస్తున్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలహీనపడటం వల్లే బీజేపీకి మార్గం సుగమమైందని, కేరళలో తమను ఢీకొనే శక్తి లేకనే కాంగ్రెస్ ఇలాంటి అవాస్తవ ప్రచారాలకు తెరలేపిందని వామపక్షాలు మండిపడుతున్నాయి. అభివృద్ధి పథకాలు, సంక్షేమం తమను గట్టెక్కిస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, త్రిముఖ పోటీ నెలకొన్న ప్రతి నియోజకవర్గంలోనూ గెలుపోటముల అంతరం కేవలం కొన్ని వందల ఓట్లలోనే ఉండే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితుల్లో ప్రతి చిన్న ఓటు చీలిక కూడా ఫలితాలను తారుమారు చేయగలదు. బీజేపీ పెరిగే కొద్దీ కాంగ్రెస్ బలహీనపడటం, తద్వారా పరోక్షంగా లెఫ్ట్ ఫ్రంట్‌కు లబ్ధి చేకూరడం అనే సమీకరణంపైనే రాహుల్ గాంధీ కేంద్రీకరించారు. ముగింపులో చెప్పాలంటే, కేరళ ఎన్నికలు ఇప్పుడు కేవలం రాష్ట్ర సమస్యలకే పరిమితం కాలేదు. ఇది జాతీయ స్థాయి కూటముల భవిష్యత్తును, మరీ ముఖ్యంగా విపక్షాల ఐక్యతను పరీక్షించే యుద్ధంగా మారింది. రాహుల్ గాంధీ చేస్తున్న 'రహస్య పొత్తు' ఆరోపణలు ఓటర్లను ప్రభావితం చేస్తాయా? లేక పినరయి విజయన్ తన వ్యూహాలతో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంటారా? లేదా బీజేపీ ఆశించినట్లుగా కేరళలో ఒక కొత్త శక్తిగా ఉద్భవిస్తుందా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది. ఏది ఏమైనా, సిద్ధాంతాల ముసుగులో జరుగుతున్న ఈ అధికార దాహపు పోరాటంలో అంతిమంగా కేరళ విజ్ఞుడైన ఓటరు తీర్పు ఎలా ఉంటుందో చూడాలి. ఈ ఎన్నికలు కేరళ రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చేసే ప్రమాదం లేదా అవకాశం రెండూ ఉన్నాయి. తీరంలో మొదలైన ఈ రాజకీయ అలలు రేపు ఫలితాల రోజున ఎవరిని ముంచేస్తాయో, ఎవరిని తేలుస్తాయో వేచి చూడాల్సిందే.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863

## పార్కిన్‌సన్ పట్ల అవగాహన అవసరం

నేడు "ప్రపంచ పార్కిన్‌సన్ దినం"
ఈ సందర్భంగా ప్రత్యేక కథనం




శరీర ప్రగతిశీల నాడీమండల రుగ్మత కారణంగా అసాధారణ శరీర కదలికలైన ప్రకంపనలు, దేహ సంతులన స్థితిలో లోపాలు, కండరాలు గట్టిపడడం, నడకలో తడబాటు, మాటలు/మింగడంలో సమస్యలు, శరీర కదలికలు మందగించడం, వణుకు, ధృఢత్వానికి సంబంధించిన లక్షణాలు కనిపించడాన్ని "పార్కిన్‌సన్ వ్యాధి"గా నామకరణం చేస్తారు. మెదడులోని శరీర కదలికలకు కారణమైన డోపమిన్ ఉత్పత్తి చేసే నాడీ కణాలు నశించడం వల్ల ఆ రుగ్మత బయట పడుతుంది. డోపమిల్ విడుదల తగ్గడం వల్ల శరీర కదలికలు క్రమంగా తగ్గుతూ పార్కిన్‌సన్ వ్యాధి లక్షణాలకు దారి తీస్తుంది. జన్యుపరమైన కారణాలతో పాటు పర్యావరణ ప్రభావాలతో ఈ వ్యాధి ప్రబలినప్పటికీ ఇది అంటువ్యాధి కాకపోవడం కొంత ఊరటను కలిగిస్తున్నది. అన్ని వయస్సుల వారిలో కనిపించే పార్కిన్‌సన్ వ్యాధి వయోవృద్ధుల్లో అధిక శాతం కనిపిస్తుంది. ప్రపంచ పార్కిన్‌సన్ దినం–2026 ఇతివృత్తం : పార్కిన్‌సన్ వ్యాధి పట్ల ప్రజల్లో, ముఖ్యంగా వ్యాధిగ్రస్తుల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 11 ఏప్రిల్ రోజున "ప్రపంచ పార్కిన్‌సన్ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ పార్కిన్‌సన్ దినోత్సవ ఇతివృత్తంగా "ఆరోగ్య సురక్ష అంతరాలను పూడ్చడం (బ్రిడ్జింగ్ ది కేర్ గ్యాప్)" తొలి దశలో గుర్తిస్తే కొంత వరకు చికిత్స చేయడానికి వీలు ఉండడంతో పాటు ఇతర వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి లక్షణాలను కొంత మేరకు అదుపు చేయగల వైద్య చికిత్సలు ఉన్నాయి. వ్యాయామం ద్వారా శరీర కదలికల్లో కొంత ఉపశమనం కూడా పొందడం జరుగుతుంది. పార్కిన్‌సన్ వ్యాధి క్రమంగా ముదిరిన కొద్ది రోగుల పరిస్థితులు విషమంగా మారతాయి. పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తులు/కుటుంబ సభ్యులకు అవగాహనలు, తొలి దశలో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల సమీప బంధువులకు జాగ్రత్తలు వివరించడం, వ్యాధి కట్టడికి పరిశోధనలు, చికిత్సలో ముందడుగు లాంటి అంశాలను చర్చించే వేదికలుగా ప్రపంచ పార్కిన్‌సన్ దినం ఉపయోగపడుతుంది. పార్కిన్‌సన్ వ్యాధి పట్ల శ్రద్ధ, సంరక్షణ, సహాయం చేయడం పౌర సమాజ కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. పార్కిన్‌సన్ వ్యాధి ప్రభావాన్ని తగ్గించడానికి వైద్య చికిత్సలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, అక్కుపేషనల్ థెరపీ, వ్యాధిగ్రస్తులకు/సహాయ సిబ్బందికి విశ్వాసం కలిగించడం, రోగుల పట్ల సంఘీభావాన్ని తెలుపడం లాంటివని ఉత్తమ మార్గాలుగా పేర్కొనవచ్చు. మిలియన్ల పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తుల జీవితాల్లో స్థిరత్వం పెంచడానికి తగు వైద్య విధానాలు, ఔషధాలు, అవగాహనలు, పరిశోధనలు నిరంతరం జరగాలని, వ్యాధిగ్రస్తుల జీవితాల్లో కొంత ఉపశమనం కల్పించాలని కోరుకుందాం.



డాక్టర్ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037

## నిప్పుల కుంపటిగా తెలంగాణ





ఏప్రిల్ వచ్చేసింది.. తెలంగాణ నిప్పుల కుంపటి గా మారింది. సూర్యుడు సుర్రు మంటున్నాడు.. అసలే పెళ్లిళ్ల సీజన్... పెళ్లిళ్ల తో కళ్యాణ మంటపాలు కలకల లాడుతున్నాయి. యే మండపం ఖాళీగా లేదు. మంచి ఘడియలు వుండడంతో నిత్యం భాజా భజంత్రీలు మోగుతూ వున్నాయి. పెళ్లికి వచ్చే బంధు మిత్రులు పెరిగిన ఎండలు, వడ గాలులతో బేజారు అవుతూ వున్నారు. ఏ.సి ఫంక్షన్ హాల్లో పెళ్ళిళ్ళు అయితే ఎండ తగ్గే వరకు అక్కడే కూర్చుని కబుర్లు చెప్పు కుంటూ వుంటున్నారు. నాన్ ఏసీ అయితే వారి బాధలు వర్ణనతీతం. తెలంగాణలో ఎండల తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతోంది. ఉదయం 8 నుంచే సూరీడు భగభగ మంటున్నాడు. ఇక మధ్యాహ్నం పూట సెగలు కక్కుతున్న సూర్యుడిని చూసి బయటకు వెళ్లాలంటే జనం జంకుతు న్నారు. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.రాబోయే వారం రోజుల లో పలు ప్రాంతాల్లో పగలు 46 డిగ్రీల వరకూ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలు న్నాయని వాతావరణ శాఖ తెలిపింది. వాయువ్య భారత ప్రాంతాల నుంచి తెలంగాణలోకి తక్కువ ఎత్తులో గాలులు వీస్తుండటంతో వేడి పెరుగుతోంది. బుధవారం అత్యధికంగా మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో, కాసిపెట్ లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట కూడా వేడి ఎక్కువగా ఉంటుండటంతో ప్రజలు ఉక్కపోతతో నానా ఇబ్బందులు పడుతున్నారు.పిల్లల బాధలు వర్ణనాతీతం. ఖమ్మంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమో దైంది. ఉష్ణోగ్రతలు పెరగనుండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. బయటకు అవసరం వుంటేనే వెళ్ళండి. ఇంటిలో ఇప్పటికే మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం తాగుతూ వుండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. మసాలాలు ఎక్కువగా వాడొద్దు. మాంసాహారం తీసుకోక పోవడం బెస్ట్. గంటకు ఒకసారి గ్లాస్ చొప్పున నీరు తాగాలి. ఒక వేళ వడ దెబ్బ కొడితే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు, పళ్ళ రసాలు ఇవ్వాలి. కాటన్ దుస్తులు ధరించాలి. నీరు తాగాలి. ఎండలో వెళ్ళే వారు గొడుగు, లేదా టోపీ పెట్టుకొని వెళ్ళాలి. చల్లని శీతల పానీయాలు తాగరాదూ. నల్ల దుస్తులు ధరించ కూడదు. సో ఎండకు బయటకు రాకుండా ఉందాం, వడ దెబ్బ నుండి రక్షణ పొందుదాం.



కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9848445134

## కవిత అంటే..

కవితంటే మాటల మురిపెంగా
మనసును మెల్లగా మెప్పించాలి
మల్లెపూల పరిమళంలా మాటల
మధ్య మాధుర్యం జార్పించాలి
కవితంటే మెరుపుల జిలుగుగా
అక్షరాల్లో ఆలోచనలు
మెరిపించాలి
ఒక్క పదమే పిడుగైపోయి నిద్ర
లోనూ చైతన్యం నింపేలాగుండాలి
కవితంటే మత్తును దూరం చేసే
మధురమైన జ్ఞాపకాల మందు
కావాలి
చీకటిలో చతికిలపడక దారిచూపే
దీపమై నిలవాలి
కవితంటే మాధుర్య గానం మనసు
గూటిలో గూడు కట్టాలి
చల్లని గాలిలా చేరిచింతలను
మెల్లగా దూరం చేయాలి
కవితంటే హృదయాన్ని తట్టాలి
మనిషి మనసును మెలిపెట్టాలి
నిశ్శబ్దంలో మాటలై నిజాలను
నిద్రలేపాలి
కవితంటే మానవత్వ దర్పణం
మనుగడకు మార్గం చూపాలి
కన్నీటి బొట్టులోనూ కరుణ
వెలుగులు నింపాలి
కవితంటే కేవలం పదాలు కాదు
ప్రాణం పోసిన
భావాల
ప్రపంచం
మనసు నుంచి
మనసుకు చేరే
మానవత్వపు
మధుర
సందేశం ..



- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

## సామాజిక న్యాయం - ప్రపంచ శాంతికి వారధి

నేడు అంతర్జాతీయ కార్మిక సంస్థ ఏర్పాటు సందర్భంగా ప్రత్యేక కథనం..

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్
జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494




మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, "సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు" అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ'. ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది.19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్లెస్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసు కుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందిం చినా, అది క్షేత్రస్థాయిలో అమలుకావడానికి అవసరమైన సమతూల్యత దొరుకుతుంది. ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. "పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు" అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూల మని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటివరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందిం చింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం, వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు. ప్రస్తుతం 187 సభ్య దేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'( గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది. భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుంచి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. అయితే, గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది. నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు, యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడ టమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం. వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుంచి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. అయినప్పటికీ ఇంకా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగితా రేటును చూస్తే ఐ.ఎల్.ఓ ప్రయాణం ముగియలేదని అర్థమవుతుంది. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 11.04.2026
www.mudranews.in | @mudranews



**యవ్వనంగా ఉండాలంటే**



కూల్‌డ్రింక్స్ తగ్గించండి. వీటిలో చక్కెర ఎక్కువగా ఉండి చర్మ ప్రోటీన్లను నాశనం చేస్తుంది. ఎముకల బలం కూడా తగ్గి వృద్ధాప్య లక్షణాలు వేగంగా వస్తాయి.

## సంక్షిప్తంగా..

### మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ లక్ష్మి నారాయణ కాలనీలో శ్రీ మల్లెల మైసమ్మ ఆలయ పునఃనిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి పునఃనిర్మాణ కార్యక్రమాలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**ముద్ర, నారాయణపేట:** పట్టణంలోని యాదగిరి రోడ్, బైరం కొండ గ్రామాల మధ్య బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నారాయణపేట పోలీసులు పట్టుకున్నారు. దామరగిద్ద మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసుల సమాచారం మేరకు గుర్తించి పట్టుకున్నారు. 50 బస్తాలలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వాహన యజమాని వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై అందే వెంకటేశ్వర్లు తెలిపారు.

### నేలకొరిగిన చెట్టు



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓ భారీ వృక్షం శుక్రవారం మధ్యాహ్నం నేలకొరిగింది. ఎంతో కాలంగా ఆఫీస్ ఆవరణలో ఉన్న ఈ వృక్షం విరిగిపడిపోవడంతో అధికారులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నేల కొరిగిన వృక్షం ద్విచక్ర వాహనంపై పడటంతో వాహనం ధ్వంసమైంది.

### అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ముద్ర, వనపర్తి:** అక్రమ అరెస్టుల తో ఉద్యమాన్ని ఆపలేరని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కార్యదర్శి వాకిటి శ్రీధర్ అన్నారు. గురువారం ముదిరాజ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్ మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ముది రాజులను బీసీ ఏకి మార్చాలని, కోకాపేటలో ముది రాజులకు కేటాయించిన భూమి విషయంపై ఏర్పాటు చేసిన ట్రస్టును రద్దు చేయాలని, ఆ భూమిని ముదిరాజ్ జాతికి అంకితం చేయాలి అని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని, మత్స్యశాఖకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ పేరుతో విడుదల చేసిన నిధులు దుర్వినియోగంపై పూర్తి స్థాయి విచారణ జరపాలన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ ఎస్సి బాలుర వసతి గృహాన్ని సందర్శించి తరగతి తరగతి గదులు, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని ఇందిరా నగర్ రేషన్ షాప్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ప్రజలకు సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు, బియ్యం, చక్కెర, తదితర వస్తువుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. స్టాక్ రిజిస్టర్, పంపిణీ రికార్డులను పరిశీలించి సరుకులు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్స, ఔషధాల లభ్యతపై సమగ్రంగా పరిశీలించారు. వివిధ వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను తనిఖీ చేశారు. రోగులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, డిఎంసిఎస్ మురళీకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సుపరింతెన్డెంట్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



**అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

ఈ నెల 13 నుంచి 18 వరకు కొనసాగనున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమష్టి కృషితో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు అరైవ్ – అలైవ్, రోడ్డు సేఫ్టీ కార్యక్రమాల పై జిల్లా ఎస్పీ స్నేహ మేహరా, అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన అరైవ్ – అలైవ్ లో అందరిని భాగస్వాములు చేయాలన్నారు. జిల్లా ఎస్ పి స్నేహా మెహ్రా మాట్లాడుతూ జిల్లా లో బ్లాక్ స్పార్ట్స్ గుర్తించి, సైన్ బోర్డ్స్, ఏర్పాటుపై పిపిటి ద్వారా వివరించారు. జెడ్పీ సీఈవో శ్రీధర్,డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారి వెంకట్ రెడ్డి, డిపిఓ జయసుధ, డీఈవో రేణుకా దేవి , ఆర్ అండ్ బి అధికారి శ్రీధర్ రెడ్డి, పి ఆర్ ఉమేష్ కుమార్, వైద్యాధికారి స్వర్ణ కుమారి, ఎన్ ఎచ్ ఐ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ లు, డి ఎస్ పి లు, సిఐ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర జీవనానికి హోమియోపతి మార్గం

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** ఆయుష్ సేవలు, యోగాను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపునిచ్చారు.శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం హోమియోపతి, యోగా, ఆయుర్వేద వంటి సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తోం దన్నారు. హోమియోపతి వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. దీని ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, అలర్జీలు, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు.హోమియోపతి వైద్యం తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటం,



దుష్ప్రభావాలు తక్కువగా ఉండటం, అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉండటం వంటి ప్రయోజనాలను కలిగి ఉందన్నారు. వెల్నెస్ సెంటర్లు, ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ గోపాల్ నాయక్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఉషారాణి, వివిధ విభాగాల వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

# ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైపులైన్ గ్యాస్

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ఎల్పీజీ గ్యాస్ కు ప్రత్యామ్నాయంగా పైప్ లైన్ నాచురల్ గ్యాస్ ను వ్యవస్థీకరించడానికి అన్ని శాఖలు సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో పైప్ లైన్ గ్యాస్ వినియోగానికి రోడ్, నేషనల్ హైవే ఇతర ప్రాంతాలలో నిర్మాణ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. పైప్ లైన్ గ్యాస్ వినియోగానికి ప్రజలు ఆసక్తి చూపేలా



అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** దివ్యాంగుల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో 16 మంది దివ్యాంగులకు శుక్రవారం ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించనున్నట్లు, భవిష్యత్తులో మరింత మందికి సాయం విస్తరణకు హామీ ఇచ్చారు. దివ్యాంగుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, కార్పొరేటర్లు,కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

**పయనీర్ కేంద్రం సందర్శన**

మహబూబ్‌నగర్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పయనీర్ సెంటర్‌ను సందర్శించారు. నీట్, ఎప్సెట్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తన సొంత నిధులతో ఉచితంగా అందిస్తున్న ఈ సెంటర్ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 116 మంది విద్యార్థులు పలు కోర్సు ల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ సంవత్సరం అంతకుమించి ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. చదువు ఒక్కటే మనకు శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, కార్పొరేటర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

**ముద్ర, నారాయణపేట :** ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం జిల్లా సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం క్వింటాలు గ్రేడ్ –ఏ రకానికి 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు భద్ర పరుచుటకు సరిపడా ఏర్పాట్లు చేయాలని, నిబంధనల ప్రకారం రైతులకు గోనె సంచులు ఇవ్వాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, నీడ, మూత్రశాలలు, విద్యుత్, టేబుల్, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రములో ఖచ్చితముగా 2 ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, 30 టార్పాలిన్లు, 1 ప్యాడి క్లీనర్ అందుబాటులో ఉంచాలని, ఒకవేళ ప్యాడి క్లీనర్ లేనిచో ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ను ఏర్పాటు చేయాలని



తెలిపారు. జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు కొనుగోలు రిజిస్టర్ లో నమోదు చేసి ట్యాబ్ నందు వివరాలు నమోదు చేయాలని, ట్రక్ చిట్ లో వ్రాసిన రైతుల ప్రకారమే మిల్లులకు ధాన్యం సరఫరాలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో ఐకెపి 82, పిఎసిఎస్ 65, మెప్మా 5, ఎఫ్ పి ఓ ఏడు, ఎఎంసి ఒకటి మొత్తం 160 కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆరు చెక్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఎస్.పి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### గద్వాల బస్టాండ్ లో తాగునీటికి కటకట

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతోంది. తాగునీరు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. చల్లని నీరు లేకపోగా కనీసం తాగడానికి నీటి సరఫరా కూడా సరిగా చేయడం లేదు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ అలంకార ప్రాయంగా మారింది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ ఫ్రిడ్జి మరమ్మతులు నోచుకోలేదు . మండుతున్న ఎండలకు గొంతు ఎండుతోందని త్రాగు నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగునీళ్లు కొన్నేపరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు బస్టాండ్ లో ఫ్యాన్ సౌకర్యాలు లేక ఉక్కపోతకు గురై ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గద్వాల ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రశిక్షణ మహా అభియాన్ విజయవంతం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పదర మండలంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు నీలం రవి ముదిరాజ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా సమస్యలపై స్పందిస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ పి. నాగేందర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాత్లవాత్ మంగ్య నాయక్, మండల ఇంచార్జి, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, మండల ప్రశిక్షణ కన్వీనర్ శంకర్ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు గోలి శ్రీను, కొయ్యల మల్లేష్ మాదిగ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్ కర్నూల్ విద్యుత్ భవనంలో మూడో రోజు కూడా ఆర్టిసన్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా డివిజన్ చైర్మన్ మిద్దె శ్రీనివాసులు జేఏసీ నాయకులు దశరథం, సైదులు, ఉమ్మడి జిల్లా కో–చైర్మన్ రాజ్‌కుమార్, డివిజన్ కన్వీనర్లు జయకర్, మల్లయ్య, నాయకులు ప్రభాకర్, రాజ్ మనోహర్, ప్రవీణ్, ఉపేందర్, శంకర్, జితేందర్ రెడ్డి, నాగరాజు, వెంకటయ్య, విష్ణు, రాజు, రంజిత్ కుమార్, దయాకర్, అమర్‌నాథ్, మైబన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా 327 యూనియన్ నుంచి డివిజన్ అధ్యక్షులు లక్ష్మయ్య, 1104 యూనియన్ నుంచి జిల్లా కార్యదర్శి నిరంజన్ యాదవ్, నాయకులు విజయ భాస్కర్, తిరుపతయ్య, బీఎంఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, జిల్లా కార్యదర్శి బాలరాజు, టీఆర్‌వీకేఎస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



పాల్గొని సమ్మెకు మద్దతు ప్రకటించారు.

**ముద్ర, కాప్రా:** సైనిక్ పురి డివిజన్ పరిధిలోని మౌలాలి సబ్ స్టేషన్ కార్యాలయాల ఎదుట 250 మందికి పైగా ఆర్టిజన్ కార్మికులు మూడోవ రోజు సమ్మె కొనసాగించారు. హబ్సిగూడ సర్కిల జేఏసీ ఏసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, కో–కన్వీనర్ క్రిస్టోఫర్,బాల్ రెడ్డి, రంగు జానయ్య గౌడ్, ఉపేందర్ రెడ్డి,సంతోష్ రెడ్డి,యాదగిరి, మల్లా రెడ్డి, రాము, జానీ, రమే, మమత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా ప్రాంగణాల కోసం ఖాళీ స్థలాలను గుర్తించాలి



**ముద్ర, శేరిలింగంపల్లి:** క్రీడా ప్రాంగణాల కోసం తమ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల వివరాలు మూడు రోజుల్లో అందించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోన్ పరిధిలోని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 50 శాతానికి పైగా పూర్తయిన పనులను 99 రోజుల ప్రణాళికలోగా పూర్తి చేయాలని, రోడ్లపై గుంతలను గుర్తించి ప్రతి 15 రోజులకోసారి నివేదిక ఇవ్వాన్నారు. ఏప్రిల్ 15 లోగా నాలల్లో పూడికతీత పనులు పూర్తి కావాలని, ఈ సందర్భంగా అమీన్‌పూర్ పార్కు పనుల ఆవశ్యకతను గుర్తుచేశారు. ఖాజాగూడలోని ఎంజెఆర్ బిల్డింగ్ సెల్లార్ స్ట్రక్చరల్ అనాలిసిస్ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాయాలని సూచించారు. జంక్షన్లలో ఫుట్‌పాత్‌లు, మీడియన్ పెయింటింగ్ పనులకు సంబంధించి సర్కిల్ వారీగా ప్రతిపాదనలను సోమవారంలోగా సిద్ధం చేయాలని, ట్రాఫిక్ పోలీసులు గుర్తించిన 18 నీటి నిల్వ పాయింట్ల వద్ద శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు. సాధ్యం కాని చోట తాత్కాలిక చర్యలు చేపట్టి, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వారానికోసారి సమీక్షించి పురోగతి తెలుసుకుంటానన్నారు. వేసవి సందర్భంగా త్రాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని లీకేజీలను అరికట్టాలన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



**ముద్ర, మల్కాజిగిరి:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులను నిరంతరం అధికారులు పర్యవేక్షించాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. మౌలాలి డివిజన్‌లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మౌలాలి డివిజన్‌లోని ప్రగతి నగర్‌లో రూ.29 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే లక్ష్మీ నగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి




**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నేచురలి, తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ యూనిట్ మేనేజర్ శ్వేత సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రథమ, ద్వితీయ సంవత్సరం, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఘనంగా ఫేర్వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వారసత్వ పరిరక్షణకు ఎంఓయూ



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫర్ ఆర్ట్స్ కామర్స్ తెలంగాణ హెరిటేజ్ శాఖ మధ్య వారసత్వ పరిరక్షణకు సంబంధిం చిన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని పురాతత్వ, సాంస్కృతిక వారసత్వ స్థలాల పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి డా. పి. ధర్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు డా. హాజీరా పర్వీనా, డా. ఎం. రవీందర్ సహకారంతో కళలు, పురావస్తు శాస్త్రం, నిర్మాణ శైలి, వాణిజ్య విధానాలపై స్వల్పకాలిక పరిశోధన నిర్వహించనున్నారు. ఈ ఒప్పందం ఐదు సంవత్సరాలపాటు అమల్లో ఉండనుంది. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి, హెరిటేజ్ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు ఒప్పందంపై సంతకాలు చేశారు.

### 15న లంబడీల ఆత్మగౌరవ సదస్సు

**ముద్ర, కూకట్‌పల్లి :** ఈ నెల 15న మాకుల భావసంగ్ మహారాజ్ మ్యారామా భవాని క్షేత్రంలో నిర్వహించనున్న లంబడీల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని లంబడీల ఐక్య వేదిక ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూలో రాష్ట్ర కన్వీనర్ భూక్యా రాహుల్ నాయక్ ఆధ్వర్యంలో ఈ సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. బంజారా విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భాను నాయక్, నాయకులు సాగర్, వసంత, విశాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.ర

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 11.04.2026
www.mudranews.in | @mudranews



**యవ్వనంగా ఉండాలంటే మద్యపానాన్ని నియంత్రించండి**

మద్యం శరీరంలోని నీటిని తగ్గించి చర్మాన్ని పొడి బార్చుతుంది. కాలేయంపై ప్రభావం చూపి ముఖం కాంతిని తగ్గిస్తుంది.



# రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

**- ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం**
**- మొక్కజొన్న రైతులకు మద్దతుగా ఉంటాం**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర న్యూస్, కోరుట్ల / మెట్‌పల్లి / ధర్మపురి:** రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి వ్యవసాయ మార్కెట్లలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా సహా పలు ప్రాంతాల్లో రైతులు పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాల కోసం క్వింటాల్‌కు రూ.2400 చొప్పున మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కొనుగోళ్ల వల్ల రాష్ట్రంపై సుమారు రూ.500 కోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడమే తప్ప కొనుగోలు విషయంలో రాష్ట్రానికి సహకరిస్తలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని వెంటనే తరలించేందుకు కేంద్ర మంత్రులు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పెరిగిన మొక్కజొన్న సాగు..**

ధర్మపురి నియోజకవర్గంలో ఈ ఏడాది మొక్కజొన్న సాగు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగిందన్నారు. ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి, ఎండపల్లి మండలాల్లో సుమారు 4,898 ఎకరాల్లో సాగు చేసినట్లు వివరించారు. దాదాపు 1.46 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారన్నారు. దళారులు క్వింటాల్‌కు రూ.1600 మాత్రమే చెల్లిస్తున్న నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు.

మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారడం ఆయన వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేస్తామని తెలిపారు. ఎవరు అడ్డుకున్నా కాంగ్రెస్ కార్యకర్తల అండతో 2029లో కూడా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ధర్మపురిలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజా గౌడ్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో సుజాత తో కలిసి అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో హోమియోపతి, ఆయుర్వేదం, ఇతర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఔషధాలు అందిస్తారని తెలిపారు. రోజువారి జీవనశైలిలో యోగా ప్రక్రియను ఒక భాగంగా అలవార్చుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

## హోటళ్లలో తనిఖీ



**కోరుట్ల, ముద్ర:** కోరుట్ల మున్సిపల్ సిబ్బంది శుక్రవారం పట్టణంలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు హోటళ్లలో వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్, నిలువ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీన పరుచుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేధిచాలన్నారు. శానిటరీ ఇన్ స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, హేమంత్, జవాన్లు పాల్గొన్నారు.

# కేసీఆర్ ను కలిసిన జీవన్ రెడ్డి

**- ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్ తో లంచ్ మీటింగ్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** సిద్దిపేట జిల్లాలోని ఎర్రవెల్లి ఫాంహౌస్ లో మాజీ సీఎం కేసీఆర్‌ను శుక్రవారం మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి కలిశారు. జీవన్ రెడ్డి ఇటీవల తన నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ అనుబంధాన్ని దూరం చేసుకుని పార్టీకి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేకంగా సమావేశమయ్యేందుకు జీవన్ రెడ్డిని భోజనానికి రావాలని కేసీఆర్ ఆహ్వానించారు. దీంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు జీవన్ రెడ్డి ఇంటికెళ్లి ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ కు తీసుకెళ్లారు. జీవన్ రెడ్డిని ఫామ్ హౌస్ కు చేరుకున్న క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఆహ్వానించారు. జీవన్ రెడ్డి వెంట తన ముగ్గురు కుమారులను తీసుకెళ్లి కేసీఆర్ కు పరిచయం చేశారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడి మరోసారి నిజమైంది. ఇన్నాళ్లు ప్రత్యర్థులుగా ఉన్న కేసీఆర్, జీవన్ రెడ్డిలు ఇప్పుడు కలిసి పని పనిచేయనున్నారు.

**భావోద్వేగానికి లోనైన జీవన్ రెడ్డి..**

కేసీఆర్ ను కలిసిన సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని చెప్పారు. మీతో కలిసి పనిచేయమని దేవుడే తనను మీ దగ్గరికి పంపించారని తెలిపారు. చాలా గ్యాప్ తర్వాత ఇప్పటికైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. కాగా జీవన్ రెడ్డిని అనునయిస్తూ కేసీఆర్ అప్యాయంగా దగ్గరికి తీసుకున్నారు.

# పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందిస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- నంది మేడారంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించిన మంత్రి**




**ముద్ర న్యూస్, ధర్మారం:** పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలం తనకు రాజకీయంగా జన్మనిచ్చిందని చెప్పారు. తనను 2006లో జెడ్పీటీసీ గా గెలిపించారని గుర్తు చేశారు. ధర్మారం మండలానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ధర్మారం మండలంలోని అన్ని గ్రామాలకు సౌకర్యంగా ఉండేందుకే మేడారంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. మండల ప్రజలు మేడారంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఆసుపత్రిలో వైద్యులు, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనుల కోసం ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేసి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్రమం తప్పకుండా ఆసుపత్రిలో తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలను గుర్తించాలని సూచించారు. ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన దాతలను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో నంది మేడారం సర్పంచ్ వీర్ పాల్, స్థలదాత నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

**కార్యకర్తల గురించి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరం..**

పదేళ్లపాటు అధికారంలో ఉండి తెలంగాణ ఉద్యమకారులు, కార్యకర్తలను పట్టించుకోని కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం కుటుంబంలోని కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితలకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. ఉద్యమకారులు, కార్యకర్తలను నాటి గడీల పాలనలో పట్టించుకోలేదని విమర్శించారు. తాను సామాన్య కార్యకర్తగా ఉంటూ నేడు క్యాబినెట్ మంత్రి వరకు వచ్చానని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పక్కన ఒక కార్యకర్త కూర్చునే అవకాశం వచ్చిందన్నారు. నాడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ను కేసీఆర్ ఏనాడు పక్కన కూర్చోబెట్టుకోలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను అధిష్ఠానం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి




**బోథ్, ముద్ర:** ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ వైద్య విధానాలైన హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ, యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షమానికి కృషి



**ముద్ర, కరీంనగర్:** ప్రజా ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో శుక్రవారం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు రూ.18.80 లక్షల విలువ గల 16 రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, రూ.2.70 లక్షల విలువ గల మినీ ట్రేడింగ్ ఆటోను పంపిణీ చేశారు. పోషణ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేశారు. పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి పోస్టర్లను విడుదల చేశారు. ప్రీ–స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)) అశ్విని తానాజీ వాకాడే, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీనివాస్, సీడీపీఓ శ్రీలత, జిల్లా మేనేజర్ సుధారాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.సరస్వతి, సర్పంచ్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ నియోజకవర్గంలో మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కె. శ్రీహరి రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ తమ నియోజక వర్గంలో రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారని తెలిపారు. మంత్రి వెంటనే స్పందించి మొదటి విడతలో నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు శ్రీహరి రావు తెలిపారు.

## ఇసుక దందా పై విస్తృత తనిఖీలు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వారం రోజులుగా జిల్లాలోని సారంగపూర్, లోకేశ్వరం, బాసర, భైంసా, భైంసా రూరల్, లక్ష్మణచందా మండలాల పరిధిలో ప్రత్యేక బృందాలతో విస్తృతంగా దాడులను నిర్వహిస్తున్నారు. భైంసా పట్టణ ప్రాంతంలో తో అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. సారంగాపూర్ మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 30 ట్రాక్టర్ల ఇసుక డంప్ తో పాటు జేసీబీ సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై రెండు కేసులు నమోదు చేశారు. లోకేశ్వరం పరిధిలో 13 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. బాసర పరిధిలో రెండు కేసులు నమోదు చేసి, 50 టన్నుల ఇసుక, రెండు టిప్పర్లు, రెండు మొబైల్ ఫోన్లను జప్తు చేశారు. ఇసుకను తరలించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి షర్మిల స్పష్టం చేశారు.

## ప్రొఫెసర్, విద్యార్థిపై వేధింపులు ఆపాలి



**ముద్ర, కరీంనగర్:** శాతవాహన యూనివర్సిటీలో దళిత ప్రొఫెసర్, విద్యార్థిపై జరుగుతున్న వేధింపులను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. చక్రధరరావు, కార్యదర్శి ప్రొఫెసర్ జి. హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని వారాలుగా యూనివర్సిటీలో సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ఎకనామిక్స్ విభాగానికి చెందిన విద్యార్థి కరికే మహేష్‌లను అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు.

**యవ్వనంగా ఉండాలంటే..**



ట్రాన్స్ ఫ్యాట్ ఉన్న స్నాక్స్ తగ్గించండి. ప్యాక్డ్ ఫుడ్స్‌లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ శరీరంలో మంట పెంచుతాయి.దీంతో కొల్లాజెన్ తగ్గి చర్మం వదులుగా మారుతుంది.



## నష్టపరిహారం చెల్లించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నడికుడి నుండి బీబీనగర్ వరకు రెండవ లైన్ రైల్వే కట్ట (ట్రాక్) నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం కోటి యాభై లక్షల రూపాయలు (1.50) నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ముఖాముఖిగా చర్చించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా రెక్కలు ముక్కలు చేసుకుని భూమి మీద ఆధారపడి జీవిస్తున్న రైతులు ప్రభుత్వ అవసరాల పేరుతో భూములను గుంజుకోవడంతో వీధినా పడుతున్నారని, అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదనూరి మల్లేశం , సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్ , సిపిఎం శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ , సిపిఎం గ్రామ నాయకులు తోటకూరి మల్లేష్ , బొల్లెపల్లి ప్రవీణ్ , రైతులు ఏదునూరి శ్రీశైలం , అందె శ్రీనివాస్ , గోగు మల్లేశం , ఏదునూరి కేశవులు పాల్గొన్నారు.

## గీతా పఠనంలో బంగారు పతకాలు

**ముద్ర నడిగూడెం:** మైసూర్ దత్తపీఠ ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలో మండల కేంద్రానికి చెందిన వందనపు శృతి, కోదాడకు చెందిన బొడ్ల మాధవి బంగారపు పథకాలకు ఎంపికైనట్లు శుక్రవారం తెలిపారు. 700 శ్లోకాలు ఆన్లైన్ శిక్షణ ద్వారా కంఠస్థ పోటీల్లో ప్రతీభ కనబరిచారు. ఇరువురు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. మే 10 వ తారీఖున





మైసూర్ లో శ్రీ సచ్చిదానంద స్వామీజీ నుంచి బంగారు పథకాలు అందుకోనన్నారు. భగవద్గీత పఠనం లో బహుమతులు పొందిన ఇరువురిని బంధువులతోపాటు గ్రామస్తులు అభినందించారు.

## అధికారిపై దాడి హేయమైన చర్య

● గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బాలకృష్ణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామ పాలన అధికారి భూపాల్ పై దాడి చేయడం హేయమైన చర్య అని తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ ఖండించారు. క్షేత్ర స్థాయి విచారణ కొరకు విధి నిర్వహణలో భాగంగా భూమి మీదకు వెళ్లగానే కండ్లల్లో కారంపొడి చల్లి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని,



ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.




## భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని జలీల్ పుర మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 జరిగే బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల భీమ్ యాత్ర ర్యాలీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు ఇగ్బాల్ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మజీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి కాజమ్ అహ్మద్, స్థానిక వార్డ్ కౌన్సిలర్ బుర్హానుద్దీన్ మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలను మహనీయుల జయంతి ఉత్సవ మసంగా జరుపుకుంటున్నామని, ఉత్సవాల్లో మహనీయుల సేవలు వారి త్యాగాలను, వారు చేసే పోరాటాలను వచ్చే తరాలకు తెలియజేయటానికి ఉత్సవాలు చాలా దోహదపడతాయన్నారు. ఈ భీమ్ యాత్రలో ప్రజలు కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 12 సాయంత్రం 6 గంటలకు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే మైనారిటీల సమావేశానికి మైనార్టీలందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ గఫ్ఫార్ చౌదరి, అమీర్ ఉద్దీన్, మైనార్టీ జర్నలిస్టు ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు ఎండి సుజావుద్దీన్, షేక్ హమీద్ పాషా, అమేర్, మహాతబ్ పాల్గొన్నారు.

# చేనేత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వీరేశం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : చేనేత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం స్థానిక లింగ బసవ గార్డెన్ లో చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా, నేతన్న బీమా చెక్కులను ఆయన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేనేత రుణమాఫీ పథకం కింద 19.24 కోట్ల రూపాయలను, చేనేత భరోసా 3.29 కోట్ల, నేతన్న బీమా పథకం 2.40 కోట్ల నిధులను యాదాద్రి భువనగిరి జిల్లాలోని చేనేత కార్మికులకు విడుదల చేయడం జరిగిందన్నారు.



ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు భాస్కర రావు , అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ వెంక రెడ్డి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనను విజయవంతం చేయాలి

● జిల్లా ఎస్పీఅక్షాంక్ష్ యాదవ్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు కొనసాగనున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో సమిష్టి కృషి తో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీఅక్షాంక్ష్ యాదవ్ అన్నారు. శుక్రవారం పోలీస్ ఏ ఆర్ హెడ్ క్వాటర్స్ అరైవ్ – అలైవ్ కార్యక్రమాల పై జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని సూచించారు. వార్డు సభ్యులు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు సహా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని అన్నారు. 13న అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 15న చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డేగా జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. 16 తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. అలాగే, వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 17 వ తేదీన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం వంటి వాటి పై అవగాహన కల్పించాలన్నారు. 18వ తేదీన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిని గుర్తిస్తూ, వారికి కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, భువనగిరి డిఎస్పి రవీందర్, భువనగిరి ట్రాఫిక్ డిఎస్పి ప్రభాకర్ రెడ్డి, చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారులు ఇమ్రాన్, డిపిఓ శ్రీకాంత్, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ఇంటర్మీడియట్ అధికారి రమణి, ఆర్ అండ్ బి అధికారి సరిత సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● హోమియోపతి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంగీత

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హోమియోపతి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంగీత కోరారు. రాష్ట్ర ప్రభుత్వ "ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక" లో భాగంగా శుక్రవారం భువనగిరి జిల్లా ఆసుపత్రి వద్ద హోమియోపతి వైద్య శాస్త్ర పితామహుడు డాక్టర్ సి.ఎఫ్ శామ్యూల్ 71వ జయంతి ని ఘనంగా నిర్వహించారు. మెగా హోమియోపతి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో యోగా ప్రాముఖ్యత ను వివరిస్తూ యోగా కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా హోమియో ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంగీత మాట్లాడుతూ డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్, హోమియోపతి ఆధ్వర్యంలో హోమియోపతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అవుట్ పేషెంట్లు, భువనగిరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాల భారతి, డాక్టర్ సద్గుణ, డాక్టర్ కవిత, డాక్టర్ విజయలక్ష్మి , డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రోజీమేరీ, భువనగిరి సామాజిక కార్యకర్తలు డాక్టర్ బర్రె ప్రమీల, సద్ది (వివేరా ) వెంకట్ రెడ్డి, జంపాల అంజయ్య, మాటూరి బాలేశ్వర్, కొడారి వెంకటేష్, యోగా మాస్టర్, హోమియోపతి వైద్య సిబ్బంది, హోమియోపతి పేషెంట్లు పాల్గొన్నారు.



# మహేందర్ కు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 22వ వార్డుకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బట్టు మహేందర్ మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఘట్కేసర్ లోని నీలిమ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం హాస్పటల్ కి వెళ్లి మహేందర్ ను పరామర్శించారు. అలాగే హాస్పటల్ చైర్మన్ తో ఫోన్లో మాట్లాడి మెరుగైన వైద్య అందించాలని వైద్య ఖర్చులు తానే చూసుకుంటానని చెప్పి, వారి కుటుంబానికి కూడా అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే తో పాటు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, పిసిసి డెలిగేట్ తంగళ్లపల్లి రవి కుమార్ నాయకులు కుక్కదువు సోమయ్య, షఫీక్ అహ్మద్, బేండే లాలరాజ్, ఈరపాక నర్సింహా, సయ్యద్ ముల్తానిష, బిక్షపతి, మనీష్ ఉన్నారు.





## పూలే ఉత్సవ కమిటీ కన్వీనర్ గా పల్లగొర్ల

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ గా మాజీ ఎంపీ హనుమంతరావు, వైస్ చైర్మన్ లను, కన్వినర్ గా పల్లగొర్ల మోదీరాం దేవ్ యాదవ్ ను నియమిస్తూ శుక్రవారం జీవో నెం 174 జారీ చేశారు. ఈ సందర్భంగా రామ్ దేవ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మహనీయుని కమిటీలో చోటుదక్కడం అదృ ష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రభుత్వానికి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షు లు రాజ్యసభ ఎంపి ఆర్ కృష్ణన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్, పూలే కమిటీ చైర్మన్ వి.హెచ్ హనుమంతరావుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.




## బడిబాట ప్రారంభం

**ముద్ర నడిగూడెం:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని బృందావనంలోని ఎంపీపీఎస్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని సర్పంచ్ కంభంపాటి సరిత చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సరిత చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు సహకరించాలని అన్నారు. విద్య కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. సమ్మేటివ్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎం శ్రీనివాస్, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, ఎండి మౌలానా, కత్తి వెంకటేశ్వర్లు, మాచవరపు సురేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ లకు స్మార్ట్ ఫోన్లు: కుంభం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ ఫోన్ లు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ మండలంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి కోట మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్, మండల నాయకులు బబ్బురి పోశెట్టి గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు శెట్టి సుమన్ యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**యవ్వనంగా ఉండాలంటే పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినండి**

ఇవి యాంటీ ఆక్సిడెంట్స్‌తో నిండి కణాలను రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదింపజేస్తాయి.



## అరైవ్ అలైవ్ వీక్ విజయవంతం చేద్దాం

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న 'అరైవ్ అలైవ్ వీక్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలు చురుకుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## విమల రణదివే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి పిలుపు




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

భారత కార్మికోద్యమ నాయకురాలు, బొంబాయిలో గిర్నీ కార్మికులను మొదలుకొని దేశవ్యాప్తంగా అంగన్వాడీ, టీ తోటల కార్మికులను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ విమల రణదివే జయంతి సందర్భంగా సిద్దిపేటలోని కార్మిక-కర్షక భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి మాట్లాడుతూ, 1979లో మద్రాసులో జరిగిన మొదటి అఖిల భారత శ్రామిక మహిళా సదస్సులో మొట్టమొదటి జాతీయ కన్వీనర్‌గా నియమితులైన నాటి నుంచి చివరి శ్వాస వరకు మహిళా కార్మికుల హక్కుల కోసం పోరాడారని అన్నారు. తరువాతి తరం నాయకులు, కార్యకర్తలకు ఆమె స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఐద్వా మహిళా సంఘం స్థాపనలో కూడా కామ్రేడ్ విమల రణదివే పాత్ర మరువలేనిదని తెలిపారు. ఆమె స్ఫూర్తితో మహిళా కార్మికుల హక్కుల కోసం పోరాటాలను ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఐద్వా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జాలిగాపు శిరీష, సంజీవ్, అభి తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

చిన్న శంకరంపేట మండలం గవల్లపల్లి, జంగరాయిలో ఎరువుల దుకాణాలను అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ నిల్వలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ ఇన్వాయిస్‌లను పరిశీలించారు. మాట్లాడుతూ... స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. అనుమతుల్లేని నాసిరకం ఎరువులు విత్తనాలు, పురుగుమందులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి త్వరగా తినండి నిర్మించుకోవాలని సూచించారు.

## 11న నిజామాబాద్ పర్యటనకు మోహన్ భగవత్

**ముద్ర న్యూస్:**

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 11న నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అధికారులతో కలిసి పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. కందకుర్తిలో జరుగుతున్న తుది ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, అధికారులకు పలు సూచనలు చేశారు. మోహన్ భగవత్ పర్యటనలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బహిరంగ సభకు హాజరయ్యే వారి వాహనాల పార్కింగ్‌కు ఎంపిక చేసిన ప్రదేశం, సభా ప్రాంగణం, బారికేడ్ల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం







- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




మానవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక హెల్త్ వీక్‌లో భాగంగా శుక్రవారం స్టేడియంలో నిర్వహించిన ప్రపంచ హోమియోపతి (ఆయుష్‌డే) దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, వశిష్ట యోగా కేంద్రానికి చెందిన యోగా గురువులు ఆకుల రవి, పతంజలి యోగ గురువు మనోరంజని తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు, క్రీడాభిమానులు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగా సాధన చేయాలని సూచించారు. పురాతన కాలం నుంచే యోగాసనాలకు విశేష ప్రాముఖ్యత ఉందని, మానవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యమని అన్నారు.

## ఆయుష్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ కె. హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




ప్రభుత్వ సమీకృత ఆయుష్ వైద్యశాలలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ సమీకృత ఆయుష్ వైద్యశాలలో నిర్వహించిన ఉచిత ఆయుష్ మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆయుర్వేద, యునాని, హోమియోపతి ఓపీ వార్డులు, మెడిసిన్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి మందుల తనిఖీ చేశారు. మందులు ఇవ్వడమే కాకుండా వాటిని ఎలా వాడాలో, ఆహారపు అలవాట్లపై రోగులకు స్పష్టంగా వివరించాలని డాక్టర్లను ఆదేశించారు. పలువురు రోగులతో మాట్లాడిన కలెక్టర్, మోకాలి నొప్పులు, జీర్ణ సమస్యలు తదితర వ్యాధులకు ఆయుష్ వైద్యం ప్రయోజనకరమని సూచించారు. ఈ మందులు వాడే సమయంలో పులుపు ఆహారాన్ని నివారించాలని, మొక్కజొన్న, జొన్న, రాగి జావ వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ వారం హెల్త్ వీక్ సందర్భంగా ఆయుష్ వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ వైద్యశాలలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి చికిత్సలు, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఈ 50 పడకల ఆసుపత్రిలో 24/7 ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ కేంద్రంలో చికిత్స పొందితే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి సర్జరీ సేవలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ వైద్యశాలలో ప్రకృతిలో లభించే మూలికలతో మందులు తయారు చేస్తున్నందున సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వివరించారు. ఆయుష్ కేంద్రంలో అందిస్తున్న సేవలపై విస్తృత ప్రచారం చేయాలని, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గి మంజుల రాజ్‌నర్సు, ఆయుష్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమాదేవి, ఇతర వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నర్సింగ్ విద్యార్థినీల నిరసన

- స్పందించిన కలెక్టర్ ప్రతిమా సింగ్, విచారణకు డీఐఈఓ మాధవి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నర్సింగ్ కళాశాల విద్యార్థినీలు మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. సమస్యల పరిష్కారం కోసం కళాశాల నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడిచి రాందాస్ చౌరస్తాకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్ అక్కడికి చేరుకుని విద్యార్థినీలతో మాట్లాడారు. మండుటెండలో అక్కడ ఉండడం కష్టమని భావించి, ప్రైవేటు బస్సులో వారిని కలెక్టరేట్‌కు తరలించారు. కలెక్టరేట్‌లో విద్యార్థినీలు తమ సమస్యలను కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినిపించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ నగేష్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవికి ఆదేశించారు. ప్రజావాణి హాల్‌లో విద్యార్థులతో మాట్లాడిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, అనంతరం నర్సింగ్ కళాశాలలో సమస్యలు తదితర విషయాలను పరిశీలించారు. పూర్తి నివేదికను రెండు రోజుల్లో కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గ్ సీఐ రేణుక కూడా విద్యార్థులతో మాట్లాడారు.

## కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**ముద్ర న్యూస్ :**

రెంజల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలని ప్రారంభించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తహసీల్దార్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## సిలిండర్ పేరుతో మోసాలు.. అప్రమత్తంగా ఉండాలి

**ముద్ర న్యూస్ :**

గ్యాస్ సిలిండర్లు దొరకవేమోననే ఆందోళనతో ఇటీవల చాలా మంది అవసరం లేకపోయినా ముందస్తుగా బుకింగ్‌లు చేస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగుతూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు పెంచుతున్నారు. కేవైసీ అప్‌డేట్, ఓటీపీలు, ప్రత్యేక లింకులు అంటూ వాట్సప్ ద్వారా సందేశాలు పంపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్యాస్ బుకింగ్‌లు తప్పనిసరిగా అధికారిక యాప్‌లు లేదా వెబ్‌సైట్ల ద్వారానే చేయాలని, తెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ పేరుతో కాల్ చేసి బుకింగ్ చేస్తున్నామని చెప్పినా నమ్మకూడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వినియోగదారుల అనుమతి లేకుండా వారి పేరిట ఎవరూ గ్యాస్ బుక్ చేయరని తెలిపారు. మోసగాళ్లు ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగే అవకాశమున్నందున వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోరాదని హెచ్చరిస్తున్నారు. కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే కాల్స్‌పైనా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవసరమైతే వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. అలాగే బుకింగ్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో పంపించే ఏపీకే ఫైల్ లింకులను క్లిక్ చేయకూడదని, తెలియని లింకుల ద్వారా ఎలాంటి చెల్లింపులు చేయవద్దని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి సందేహాలు ఉంటే ఏజెన్సీని నేరుగా సంప్రదించడం లేదా స్వయంగా వెళ్లి వివరాలు తెలుసుకోవడం సురక్షిత మార్గమని అధికారులు పేర్కొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**యవ్వనంగా ఉండాలంటే గింజలు, డ్రై ఫ్రూట్స్ తీసుకోండి**

బాదం, వాల్‌నట్స్ వంటి వాటిలో మంచి కొవ్వులు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.





## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

- **పెండింగ్ డీఏ విడుదల**
- **జనవరి 1 నుంచి అమల్లోకి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఆర్టీసీ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని (డీఏ) విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జనవరి 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ 2.1 శాతం పెంపుతో, ఉద్యోగుల మొత్తం డీఏ 52.8 శాతానికి చేరుకుంది. జనవరి నుంచి చెల్లించాల్సిన ఈ పెండింగ్ డీఏ బకాయిలను భవిష్యత్తులో రాబోయే మూడు నెలల కాలంలో, ప్రతి నెలా కొంత చొప్పున విడతల వారీగా విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంస్థ పరిరక్షణతో పాటు కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ వెల్లడించింది.

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం తార్నాక ఆసుపత్రిని అప్ గ్రేడ్ చేయడం, కారుణ్య నియామకాలు చేపట్టడం, గతంలో వివిధ కారణాలతో తొలగించబడిన వారిని త్రీ మెన్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పని భారం తగ్గించేందుకు కొత్త నియామకాలు, ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సుల కొనుగోలు వంటి కార్యక్రమాలతో సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తోందన్నారు.

కాగా, ఇంతకు ముందు 50.7 శాతం ఉన్న డీఏ ఇప్పుడు 52.8 శాతానికి చేరింది. జనవరి 1, 2026 నుంచి ఈ పెంపు అమలులోకి వస్తుంది. గత మూడు నెలల పెండింగ్ డీఏను సప్లిమెంటరీ బిల్లుల ద్వారా ఒక్కో నెలకు ఒకటిగా చెల్లించనున్నారు. ప్రతి నెలా ఆర్టీసీపై రూ.2.82 కోట్ల అదనపు భారం పడుతుందని ప్రభుత్వం తెలిపింది.

## దొంగను కొరికిన పిల్లి

- **లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో విచిత్ర ఘటన**
- **చర్చకు దారితీసిన పెంపుడు పిల్లి దొంగతనం ఫిర్యాదు**



**ముద్ర, లాలాగూడ:**

లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో ఓ పెంపుడు పిల్లి పంచాయితీ కలకలం రేపింది. పిల్లిని దొంగిలించాడని ఆరోపణలతో ఓ యువతి శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. తాను అల్లారు ముద్దుగా పెంచుకునే పెంపుడు పిల్లిని ఓ వ్యక్తి దొంగిలించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన సదరు దొంగ బండి నంబర్ పోలీసులకు తెలిపింది. బండి నంబర్ ఆధారంగా సదరు వ్యక్తిని గుర్తించిన పోలీసులు, అతడిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా యువతి తన పిల్లిని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో సదరు యువకుడు పిల్లిని తీసుకెళ్లిన తర్వాత అది తన చేతిని కొరికి పారిపోయిందని సమాధానం ఇచ్చాడు. ఇప్పుడు దానిని ఎక్కడ నుంచి తీసుకురావాలని ప్రశ్నించాడు. దీంతో యువతి, ఆ వ్యక్తి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బాధితురాలు పట్టుబట్టడంతో సదరు దొంగ కాళ్లు మొక్కి క్షమాపణలు చెప్పాడు. చివరకు ఇద్దరినీ నచ్చజెప్పిన పోలీసులు... ఆ వ్యక్తిని హెచ్చరించి వదిలిపెట్టారు.

## మాతో ఆడుకోవద్దు..

- **ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక**

**ముద్ర డెస్క్:**

అమెరికాఇరాన్ మధ్య పాకిస్థాన్ వేదికగా జరగనున్న శాంతి చర్చలను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ''మేం చర్చల కోసం ఎదురుచూస్తున్నాం. అవి సానుకూలంగా ఉంటాయని ఆశిస్తున్నాం. ఇరాన్ నేతలు చిత్తశుద్ధితో చర్చలకు సిద్ధంగా ఉంటే.. మేం కచ్చితంగా సహకారం అందిస్తాం. ఒకవేళ వారు మాతో ఆడుకోవాలని చూస్తే.. మా బృందం కూడా అదే రీతిలో వ్యవహరిస్తుందని తెలుసుకుంటారు'' అని జేడీ వాన్స్ హెచ్చరించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని ముగించేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ఇస్లామాబాద్ వేదికగా మరికొన్ని గంటల్లో శాంతి చర్చలు జరిపేందుకు ఇరు దేశాలు సిద్ధమయ్యాయి. ఇరాన్ బృందం ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకోగా.. అమెరికా ప్రతినిధి బృందం మరికొన్ని గంటల్లో పాకిస్థాన్‌కు రానుంది. ఇరు దేశాల ప్రతినిధి బృందాలు ప్రత్యక్షంగా చర్చలు జరుపుతాయా? లేదా పరోక్షంగానా? అనే అంశంపై సమాచారం లేదు అయితే, ఈ చర్చల కోసం డొనాల్డ్ ట్రంప్ తమకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారని, ఏ విధంగా కొనసాగుతాయో చూడాల్సి ఉందని జేడీ వాన్స్ పేర్కొన్నారు.




## ఏఐ పర్యవేక్షణతో పెరిగిన ఆదాయం

- **2047 వరకు త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనే లక్ష్యం**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం, వివిధ శాఖల్లో పన్నుల ద్వారా వస్తున్న ఆదాయంపై నిరంతరం సమీక్ష, పకడ్బందీ నిర్వహణతో వివిధ శాఖల్లో ఆదాయం పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామని తెలిపారు. నిరంతరం సమీక్షలు, పన్ను ల నిర్వహణలో పకడ్బందీ చర్యల మూలంగా కమర్షియల్ టాక్స్ శాఖలో జీఎస్టీ ఆదాయం గత మూడు నెలలుగా 15శాతం పెరుగుదల కనిపించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో సైతం ఆదాయంలో పెరుగుదల కనిపించిందని అన్నారు. ప్రతి శుక్రవారం రెవెన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. 2047 వరకు త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధన లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల విక్రయానికి సంబంధించి ప్రపంచ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేసి అధ్యయనం పూర్తి చేశారన్నారు. ఆ కమిటీల నివేదికలను ముందుగా సబ్ కమిటీకి సమర్పించి ఆ తర్వాత క్యాబినెట్ కు నివేదించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మెట్రో రైల్ స్వాధీనం, నిర్వహణ, ఆదాయ, వ్యయ మార్గాల పైన అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్, రెవెన్యూ, పరిశ్రమల శాఖలోనూ ఆదాయం పెంపునకు సంబంధించి చేపట్టిన చర్యలు ఫలితాలపై మంత్రులు సమీక్ష చేశారు. ప్రతి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వాటి ఫలితాలు యాక్షన్ టేకెన్ రిపోర్టు తో తదుపరి సమావేశానికి రావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, సభ్య సాచి ఘోష్, శ్రీధర్, ఎలంబర్తి శశాంక పాల్గొన్నారు.

## మావోయిస్టు పార్టీపై నిషేధం ఉండాల్సిందే..

- **ప్రజలకు మంచి చేయాలంటే ప్రజల్లోనే ఉండాలి**
- **డీజీపీ బి.శివధర్ రెడ్డి**
- **పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు 42 మంది లొంగుబాటు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయాలనడం సరికాదని డీజీపీ బి.శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పోరాడటానికి, ప్రజల్లో ఉండి పని చేయడానికి ఏ రాజకీయ పార్టీతోనో లేదా సాయుధ సంస్థలతోనో సంబంధం ఉండాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా సేవ చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న సాయుధ పోరాటానికి తెరదించుతూ పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు 42 మంది తమ ఆయుధాలతో శుక్రవారం డీజీపీ బి.శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ భారీ లొంగుబాటుతో తెలంగాణలో పీఎల్‌జీఏ బెటాలియన్ పూర్తిస్థాయిలో కనుమరుగైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో క్రియాశీలక మావోయిస్టు కేడర్ ఎవరూ లేరన్నారు. దీనితో తెలంగాణ ఇప్పుడు పూర్తిస్థాయిలో 'మావోయిస్టు రహిత' రాష్ట్రంగా అవతరించిందని ప్రకటించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అడవుల్లో ఇంకా మిగిలి ఉన్న వారు కూడా వెంటనే ఆయుధాలు వీడి లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ కీలక నేత గణపతి ఇంకా బతికే ఉన్నారని స్పష్టం చేశారు. అయితే ఆయన ప్రస్తుతం అడవుల్లో లేరనీ అనారోగ్య సమస్యల రీత్యా ఎప్పుడో అడవినీ వీడినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. మరోవైపు కొంతమంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత బయటకు వెళ్లి మేం లొంగిపోలేదు, పోలీసులు మమ్మల్ని అరెస్ట్ చేశారని కొందరు బయట ప్రచారం చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఏదేమైనా వారు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. అదే సంతోషం అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్ఐఏ నోటీసులతో తెలంగాణ పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఒక కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు ఎవరిని విచారించాలనుకుంటున్నారో వారికి నోటీసులు ఇస్తున్నారన్నారు. అది వారి పరిధిలోని అంమని తెలిపారు.

**ఆయుధాల అప్పగింత..**

లొంగిపోయిన మావోయిస్టులు తమ వెంట తెచ్చిన సుమారు 40 అత్యాధునిక ఆయుధాలను డీజీపీకి అప్పగించారు. లొంగిపోయిన 42 మందిలో 41 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, తెలంగాణకు చెందిన వారు ఒక్కరు మాత్రమే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఇటీవల భద్రతా బలగాల కూంబింగ్ తీవ్రతరం కావడంతో, తెలంగాణ సురక్షితమైన ప్రాంతంగా భావించి తెలంగాణ పోలీసులను ఆశ్రయించినట్లు మావోయిస్టులు తెలిపారు.

## జీఏడీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ

- **మహిళలపై లైంగిక వేధింపులు, రక్షణపై చర్యలు**
- **ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వి.డి. సుధారాణి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మహిళా ఉద్యోగుల రక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో భాగంగా.. తెలంగాణ సచివాలయ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వి.డి. సుధారాణి (ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి), సభ్యులుగా జి. శైలజ (సహాయ కార్యదర్శి), టి. లక్ష్మీ ప్రసన్న (సెక్షన్ ఆఫీసర్), ఆయేషా తబస్సుమ్ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)లను సైతం నియమించారు. జీఏడీలో పనిచేసే మహిళా ఉద్యోగుల నుంచి వచ్చే లైంగిక వేధింపుల ఫిర్యాదులను ఈ కమిటీ స్వీకరిస్తుంది. వాటిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను అందజేస్తుంది.

## మెయినాబాద్ డ్రగ్స్ కేసు నిందితులకు మరో రెండు రోజుల కస్టడీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మెయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మల కస్టడీని ఉప్పర్ పల్లి కోర్టు మరో రెండు రోజులు పొడిగించింది. ఆ లోపు నిందితులను విచారించాలని ఆదేశించింది. మూడోసారి రెండు రోజుల పోలీసు కస్టడీ విచారణ పూర్తి చేసిన అనంతరం ఈ ముగ్గురినీ పోలీసులు శుక్రవారం ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలు పరిశీలించిన న్యాయస్థానం ఐదు రోజులు మంజూరు చేయకుండా మరో రెండు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు మిగిలిన రోజుల్లో మరింత కీలక సమాచారం సేకరించేందుకు విచారణను వేగవంతం చేయనున్నారు. ఇప్పటికే ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న సిట్ అధికారులు ప్రధానంగా పైలట్ రోహిత్ రెడ్డి, మరో ఇద్దరు నిందితుల బ్యాంకు లావాదేవీలపై లోతుగా విచారణ చేశారు. దుబాయిలో నిందితులకు సంబంధించిన అకౌంట్లు గుర్తించారు. ఇప్పటి వరకు జరిగిన విచారణలో నిందితులు అనేక ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. ఈ కేసు సంబంధించి మరింత విచారణ అవసరమని పోలీసులు అభిప్రాయపడ్డారు. దీంతో మరో ఐదు రోజుల పోలీసు కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ కోర్టు రెండు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చింది. ఇప్పటికే మూడోసారి కస్టడీ విచారణ జరిగినప్పటికీ.. డ్రగ్స్ సోర్స్, ఫైర్ ఆర్మ్స్ వినియోగం, దుబాయి కనెక్షన్లు, బ్యాంకు లావాదేవీలు వంటి అంశాలపై మరిన్ని వివరాలు తెలుసుకోవాల్సి ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కాగా మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో గత నెల 14న ఈగల్ టీమ్ దాడి చేసి డ్రగ్స్ పార్టీ గుట్టును రట్టు చేసింది. ఈ సందర్భంగా కొకైన్, లిక్కర్ బాటిళ్లు, ఫైర్ ఆర్మ్ స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసు దర్యాప్తు కోసం 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. నిందితులు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

## జీహెచ్ఎంసీలో అవినీతికి సీఎంయే బాధ్యుడు

- **జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని అవినీతికి కేరాఫ్ గా మార్చేశారని జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. టెండర్లు లేకుండానే రూ. కోట్ల విలువైన కాంట్రాక్ట్‌లను తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపుగా రూ. 1148 కోట్ల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని దుయ్యబట్టారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ, హెచ్ ఎండీఏలో జరుగుతున్న అవినీతికి సీఎం రేవంత్ రెడ్డియే బాధ్యుడన్నారు. రూ.5 లక్షలకు మించి ఉండే ఏ పని అయినా సరే టెండర్లు పిలవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘిస్తూ రూ. కోట్ల పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్ ను ఉల్లంఘించడమేనని చెప్పారు. టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ ఇవ్వవద్దని 2023 లో ఏర్పాటైన కమిటీ కూడా స్పష్టం చేసిందని కవిత గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 480 కోట్ల పనులను ఇదే విధంగా కట్టబెడితే.. రేవంత్ రెడ్డి సర్కార్ దాన్ని కొనసాగిస్తూ రూ.1,148 కోట్ల పనులను తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని చెప్పారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ. 35 వేల కోట్ల విలువైన భూములను అమ్మేసి.. హైదరాబాద్ అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. పైగా తన అవినీతిని మరింత పెంచుకునేందుకు ఈ సీఎం ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేస్తున్నారన్నారు. హైడ్రా పేరుతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులను హడలెత్తించడంతో పాటు స్క్వేర్ ఫీట్‌కు రూ.150 వారి వద్ద వసూలు చేస్తున్నారని కవిత విమర్శించారు. వీటికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వెంటనే ఈ బ్లాక్ మెయిల్ దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మత్తులకు ప్రభుత్వం ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు కవిత చెప్పారు. కమీషన్ల కక్కుర్తి కోసం కాకుండా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మహిళ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. బిల్లు అమలుకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవటం అన్యాయమన్నారు. మహిళ రిజర్వేషన్ డ్రాఫ్ట్ బిల్లును కూడా తాము పరిశీలిస్తామని చెప్పారు. అవసరమైతే ఢిల్లీకి కూడా వెళ్తామన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎవరో మద్దతిస్తే బతుకుతానని మాట్లాడటమంటే అది పురుషాహంకారమేనని మండిపడ్డారు.

**సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు**

ఈ నెల 25న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. ఒక్కో కమిటీలో 30 మంది సభ్యులుంటారన్నారు. 500 మంది వాలంటీర్లు ఉంటారన్నారు. ట్రాఫిక్ సమస్యలు, సభ ఏర్పాట్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వారంతా కో ఆర్డినేట్ చేసుకుంటారన్నారు. సభ ఏర్పాట్ల వివరాల కోసం కమిటీ మెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



యవ్వనంగా ఉండాలంటే తగినంత నీళ్లు తాగండి
నీరు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. డీహైడ్రేషన్ వల్ల వచ్చే ముడతలను తగ్గిస్తుంది.

# మెడికల్ హబ్ గా పాలమూరు

- పాలమూరు లో వైద్య రంగ అభివృద్ధి కి ప్రభుత్వం కృషి
- వైద్య సేవలు, విద్యా ప్రమాణాల పెంపు పై ప్రభుత్వం దృష్టి
- దక్షిణ తెలంగాణ లో వైద్య రంగానికి కేంద్రంగా పాలమూరు అభివృద్ధి
- మెడికల్ కళాశాలలో లో సీట్ల పెంపు, పీజీ కోర్సుల విస్తరణ
- జూన్ లో పాలమూరు సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి ని ప్రారంభిస్తాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



దక్షిణ తెలంగాణలో పాలమూరు జిల్లాను మెడికల్ హబ్ గా తీర్చి దిద్దుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజానర్సింహా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్, పీజీ కోర్సు ల విస్తరణ పెంచి వైద్య విద్యను విస్తృత పరుస్తామని, పేదలకు వైద్య సేవలు అందించేందుకు జూన్ లో పాలమూరు సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. మెడికల్ కళాశాల లో సీట్ల పెంపు, పీజీ కోర్సుల విస్తరణ, విద్యార్థుల కు వేర్వేరు హాస్టల్ సదుపాయాలు, ఆడిటోరియం నిర్మాణం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కొత్త గా నిర్మిస్తున్న సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి భవనం పనులు త్వరలో పూర్తిచేసి, జూన్ లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టీచింగ్ హాస్పిటల్ ప్రారంభంతో పాటు హాస్టల్స్, ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రికి అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా సమకూర్చుతుందని స్పష్టం చేశారు. నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు మహబూబ్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రెఫరల్ సెంటర్‌గా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం, ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ రిట్రీవల్ సెంటర్, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ వంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. మెడికల్ కాలేజ్‌లో ప్రస్తుతం ఉన్న విభాగాలకు అదనంగా మరో 14 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి, ముఖ్యంగా సర్జికల్ విభాగాలను బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. టీచింగ్ ఫ్యాకల్టీ కొరతను తీర్చేందుకు నియామకాలు చేపడుతున్నామని, ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన మెడికల్ ఎడ్యుకేషన్ అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు. ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న వైద్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రస్తుత ఎంపీ డీకే అరుణ మంత్రిగా ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా మెడికల్ కాలేజ్ అవసరాన్ని పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రిత్వ శాఖతో చర్చలు జరిపి, ప్రపోజల్స్‌ను ముందుకు తీసుకెళ్లడంలో ఆ సమయంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ పాత్ర కీలకం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంత్రి చొరవతోనే మహబూబ్‌నగర్‌లో మెడికల్ కాలేజ్, ఆసుపత్రి ఏర్పాటుకు దారి తీసిందని, దీంతో స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం పాత పాలమూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన డిజిటల్ హెల్త్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు 32 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉండేలా ముందస్తు వైద్య సేవలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, మేయర్ గుమ్మాల మమత, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, జాయింట్ కలెక్టర్లు హరిప్రియ, మధుసూదన్ నాయక్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, కార్పొరేటర్ సల్మాన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు రాఘవేందర్, డాక్టర్ సామ్యేల్, సాదతుల్లా, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



## వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ


**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:**

రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను బలోపేతం చేయడంతో పాటు వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో 50 పడకల అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్, తెలకపల్లిలో పీహెచ్‌సీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్రిటికల్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, నర్సుల ఖాళీలను భర్తీ చేసేందుకు భారీ స్థాయిలో నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 43 వేల పడకలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోని 35 మెడికల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక విద్యా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్ సౌకర్యాలు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, క్లినికల్ ట్రైనింగ్ వంటి అంశాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మెడికల్ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. హాస్టల్, స్టైపెండ్, క్లినికల్ ట్రైనింగ్ అంశాలపై తమ అభిప్రాయాలను విద్యార్థులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తూ, కమిషనర్ సృజన, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదాం రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, డీఎంహెచ్వో రవి నాయక్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

## దీపం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలి

- పీఎన్జీ కనెక్షన్లు పెరగాలి
- ఆయిల్ కంపెనీలు లక్ష్యం చేరుకోవాలి
- సమీక్షలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- శ్రీకాకుళం -కాకినాడ నేచురల్ గ్యాస్ పైపు లైన్ పనుల పూర్తికి కేంద్రం మంత్రికి సీఎం ఫోన్

**ముద్ర, అమరావతి:**



యుద్ధాల కారణంగా తలత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. వచ్చే ఆరు నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని, ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టి పరిస్థితుల్లో చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని తెలిపారు. త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ముఖ్యమంత్రి ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:**

ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఆమన్గల్ వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్ఫీల్డ్ రేడియల్ రోడ్ల కై భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఆదనపు కలెక్టర్(రెవెన్యూ) కే చంద్రారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హెచ్ఎండీఏ, ఎయిర్ పోర్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులతో వివరణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేడియల్ రోడ్ ఫేజ్ I' పనుల పురోగతిని సమీక్షించారు. భూ సేకరణ ప్రక్రియను, 'రేడియల్ రోడ్ 1' పనులను వేగవంతానికి భూ సేకరణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లైన రిత్విక్ ప్రాజెక్ట్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో కలిసి ఓఆర్ ఆర్ ఎగ్జిట్ 13 నుంచి ఆమనగల్ వరకు నిర్మించతల పెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ అంశాలను సమీక్షించారు. 1వ, 2వ దశలకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## నాదర్ గుల్ భూములను పరిరక్షించండి

- రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కు బీఆర్ఎస్ నేతల వినతి
- రూ. కోట్లు విలువ చేసే భూమిని ఓ మాజీ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు
- బౌన్సర్లను పెట్టి 600 మంది రైతులను బెదిరిస్తున్నారు

**ముద్ర, రంగారెడ్డి :**



నాదర్గుల్‌లోని 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజ్ శ్రావణ్, వాణీదేవి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య, పట్నం నరేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 673లో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ. కోట్లు విలువ చేసే 373 ఎకరాలను ఓ మంత్రి కబ్జా చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బౌన్సర్లను అడ్డం పెట్టుకొని 600 మంది రైతులను ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేలా బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ పరంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ల్యాండ్ చుట్టూ రేకులతో బారికేడ్లు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులకు సంబంధించిన భూముల్లో, రైతులకు భూముల్లోని బోర్లను పగలకొట్టడం, వ్యవసాయం చేసుకొనే రైతులను కొడుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారుల చర్యలు తీసుకోకపోవడంపై అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ ఘటనపై స్థానిక ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. రూ. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ ప్రభుత్వ భూములను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాపాడాలని డిమాండ్ చేశారు.

## విద్యాసంస్థల్లో ఎన్విరాన్‌మెంట్ క్లబ్ లు ఉండాలి

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ముద్ర, హైదరాబాద్:**




ప్రతీ విద్యా సంస్థలో ఎన్విరాన్‌మెంట్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. హైటెక్స్‌లో సీబీఐటీ కళాశాల శుక్రవారం నిర్వహించిన "మోడల్ యునైటెడ్ నేషన్స్ 2026" కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన వాతావరణాన్ని అందించాలంటే, విద్యార్థుల్లోనే బాధ్యత పెంచాల్సిన అవసరముందన్నారు. ఈ క్లబ్‌ల ద్వారా చెట్లు నాటడం, జలవనరులు పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రత కార్యక్రమాలు వంటి అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావచ్చన్నారు. హైడ్రా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ, ప్రకృతి వనరుల పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో పాటు వరద కాలువల పరిరక్షణను హైడ్రా పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, పార్కులు, నాలాలు, చెరువుల ఆక్రమణలను తొలగిస్తున్నామని చెప్పారు. ఇలా రూ. 70 వేల కోట్ల ప్రజా ఆస్తిని హైడ్రా కాపాడిందన్నారు. చెరువులతో వరదకు అడ్డుకట్ట వేయవచ్చునని, ఆ దిశగా ప్రాధాన్యతక్రమంలో నగరంలో చెరువులను పునరుద్ధరిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు కళాశాల నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కళాశాల విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారానికి పాల్పడిన వైద్యుడికి 7 ఏళ్ల జైలు

**ముద్ర కూకట్‌పల్లి :**



చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో రిటైర్డ్ వైద్యుడు కందుల సుబ్బారావుకు (76) కూకట్‌పల్లిలోని పోక్సో ప్రత్యేక కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. కేపీహెచ్‌బీ కాలనీలోని ఆదిత్యనగర్‌కు చెందిన డాక్టర్ కందుల సుబ్బారావుపై 2023లో నమోదైన నేరానికి సంబంధించి ఈ తీర్పు వెలువడింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 9, 10 కింద అభియోగాలు రుజువు కావడంతో, ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు ఈ శిక్షను ఖరారు చేశారు. ప్రభుత్వ ప్లీడర్ పి. సంతోష్‌కుమారి బాధితురాలి తరపున వాదనలు వినిపించగా, కెపిహెచ్‌బి పోలీసులు శాస్త్రీయ ఆధారాలను కోర్టుకు సమర్పించారు. నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన ఐఓ రాజేందర్, సీడీఓలు రఘురామ్ రెడ్డి, ప్రభునందన్ రెడ్డిలను ఉన్నతాధికారులు అభినందించారు.



## అదిగో చిరుత..

- సీసీ పుటేజ్ లో రికార్డు అయిన చిరుత సంచారం దృశ్యాలు
- మూడు నెలలుగా భయాందోళనలో గ్రామస్తులు
- చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారుల ముమ్మర ఏర్పాట్లు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**


అదిగో పులి.. ఇదిగో పులి అంటూనే నెలలు గడిచాయి. పులి ఎక్కడ, ఎప్పుడు ఏవిధంగా దాడి చేస్తుందోనంటూ స్థానికులు ప్రతి నిత్యం భయంతో బెంబెలెత్తిపోతున్నారు. చిరుత కదలికలపై నిఘా పెట్టిన అటవీ ప్రాంతంలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి చిరుత సంచరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ మేరకు అటవీశాఖ అధికారులు చిరుతను బంధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శుక్రవారం అటవీప్రాంతంలో అధికారులు పర్యటించి మరో సారిచిరుత కదలికలపై నిఘా పెట్టే అవకాశం ఉంది. మల్దకల్ మండలంలో సంచరిస్తున్న చిరుతను ఎట్టకేలకు ఫారెస్టు అధికారులు కనిపెట్టారు. మూగ జీవులపై దాడి చేసి అపహరించి ఎత్తుకెళ్తున్నట్లు గుర్తించారు. నేతువానిపల్లి గ్రామ శివారులోనే ఏకంగా 8 ఆవుదూడలు చిరుతదాడిలో మృతి చెందాయి. దీంతో బెంబేలెత్తిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పొలాలో పడిన కాలి ముద్రల కొలతలు సేకరించిన అధికారులు చిరుత జాడలని ధృవీకరించారు. తాజాగా నేతువానిపల్లి గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు అనుమానించడంతో చిరుత కదలికలను గమనించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. అటవీ ప్రదేశంలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, చనిపోయిన ఓ మూగ జీవిని అడవిలో వదిలేసి నిఘా వేశారు. ఓ సీసీ కెమెరాలో చిరుతపులి సంచరిస్తున్న వీడియో రికార్డయ్యింది. మూగజీవిని చిరుత తీసుకెళ్లే దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు. వీలైనంత త్వరగా చిరుతను బంధించే ప్రయత్నం చేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారులు వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**యవ్వనంగా ఉండాలంటే**

సరైన జీవనశైలి పాటించండి
మంచి నిద్ర, నియమిత అలవాట్లు వృద్ధాప్యాన్ని తగ్గిస్తాయి.
రోజువారీ అలవాట్లే ఆరోగ్యం మరియు అందాన్ని నిర్ణయిస్తాయి.





## సంజూ శాంసన్ గొప్ప మనసు.. అభిమానికి ఖరీదైన ఫోన్ గిఫ్ట్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మైదానంలో తన బ్యాటింగ్‌తో మెప్పిస్తుంటే, బయట తన ఉదారతతో అభిమానుల మనసులు గెలుచుకుంటున్నాడు. తాజాగా ఓ సామాన్య అభిమానికి ఖరీదైన స్మార్ట్‌ఫోన్ బహుమతిగా ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కేరళలోని పాలక్కాడ్ సమీపంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కడంపజిపురంకు చెందిన శబరీష్ అనే యువకుడు తన స్నేహితుడితో కలిసి వెళ్తుండగా, మార్గమధ్యంలో సంజూ శాంసన్ కారు కనిపించడంతో అతన్ని గుర్తించాడు. వెంటనే సెల్ఫీ కోసం వెళ్లగా, సంజూ కూడా స్నేహపూర్వకంగా స్పందించాడు. సెల్ఫీ తీసుకునే సమయంలో శబరీష్ ఫోన్ డిస్‌ప్లే పగిలిపోయి ఉండటాన్ని గమనించిన సంజూ, వెంటనే స్పందించాడు. కారు డిక్కీ నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్ తీసి అతనికి అందిస్తూ "నీ ఫోన్ పాడైంది కదా, ఇది వాడుకో" అని చెప్పాడు. దాదాపు రూ.40 వేల విలువ చేసే ఆ ఫోన్‌ను మొదట తీసుకోవడానికి సంకోచించిన శబరీష్, సంజూ ప్రోత్సాహంతో ఆనందంగా స్వీకరించాడు. వెళ్లేటప్పుడు "క్రికెట్ బాగా ఆడు" అని చెప్పి అతనికి ప్రోత్సాహం కూడా ఇచ్చాడు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సంజూ శాంసన్‌ను అభిమానులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఆయన గొప్ప మనసుకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.




# రూ.118 కోట్ల ఖర్చు.. ఫలితం శూన్యం
## ఐపీఎల్ టాప్ ఎర్నర్స్ నిరాశ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభ దశలోనే జట్లు భారీగా పెట్టుబడులు పెట్టిన స్టార్ ప్లేయర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మినహా మిగతా జట్లు ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ఆడగా, టాప్ ఎర్నర్స్ ప్రదర్శన మాత్రం నిరాశపరుస్తోంది. ఈ సీజన్‌లో టాప్10 అత్యధిక ధరకు కొనుగోలు చేసిన ఆటగాళ్లపై కలిపి సుమారు రూ.125.20 కోట్లు ఖర్చు చేశారు. అయితే అందులో రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన రవి బిష్ణోయ్ మాత్రమే తన ప్రతిభను చూపిస్తూ మెరుగైన ప్రదర్శన ఇస్తున్నాడు. అతను మూడు మ్యాచ్‌లలో ఏడు వికెట్లు తీసి జట్టుకు కీలకంగా మారాడు. మిగతా తొమ్మిది మంది ప్లేయర్లపై ఖర్చు చేసిన సుమారు రూ.118 కోట్లు ఇప్పటివరకు ఫలితం ఇవ్వలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసిన కామెరూన్ గ్రీన్ నాలుగు మ్యాచ్‌లలో కేవలం 56 పరుగులు మాత్రమే చేసి, బౌలింగ్‌లో కూడా ప్రభావం చూపలేకపోయాడు. అదే జట్టుకు చెందిన మతీష పతిరణ రూ.18 కోట్లకు తీసుకున్నప్పటికీ గాయం కారణంగా ఇంకా మైదానంలోకి దిగలేదు. చెన్నై సూపర్ కింగ్స్ భారీ ధరకు కొనుగోలు చేసిన కార్తిక్ శర్మ మూడు మ్యాచ్‌లలో పెద్దగా రాణించలేదు. మరో యువ ఆటగాడు ప్రశాంత్ వీర్ ఒక్క మ్యాచ్‌లో 43 పరుగులు చేసినప్పటికీ, స్థిరమైన ప్రదర్శన చూపలేకపోయాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున లియామ్ లివింగ్‌స్టోన్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడి 14 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ టోర్నీ ప్రారంభానికి ముందే జట్టుకు దూరమయ్యాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున జోష్ ఇంగ్లిస్ ఇంకా మ్యాచ్ ఆడలేదు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన ఆకిబ్ నబీ, గుజరాత్ టైటాన్స్ ఆటగాడు జేసన్ హోల్డర్ కూడా ఇప్పటివరకు మైదానంలోకి దిగలేదు. మొత్తంగా చూస్తే, భారీ మొత్తాలు వెచ్చించి కొనుగోలు చేసిన స్టార్ ప్లేయర్లు ఇప్పటివరకు తమ విలువను నిరూపించలేకపోయారు. అయితే ఐపీఎల్ లాంటి దీర్ఘకాలిక టోర్నీలో పరిస్థితులు ఎప్పుడైనా మారే అవకాశం ఉండటంతో, రాబోయే మ్యాచ్‌లలో ఈ ఆటగాళ్లు ఫామ్‌లోకి రావాల్సిన అవసరం ఉంది.





## తండ్రి త్యాగాల నుంచి సక్సెస్ బాట

- **కష్టాల నుంచి హీరోగా ఎదిగిన ముకుల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఓటమి ఖాయం అనుకున్న మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు అద్భుత విజయం అందించి హీరోగా నిలిచిన ముకుల్ చౌదరి కథ వెనుక ఎన్నో కష్టాలు, త్యాగాలు దాగి ఉన్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అతడు ఆడిన కీలక ఇన్నింగ్స్ ఒక్క మ్యాచ్‌ను మాత్రమే కాదు, అతని జీవిత ప్రయాణాన్ని కూడా వెలుగులోకి తీసుకువచ్చింది. ముకుల్ తండ్రి దాలిప్ తన కుమారుడిని చిన్నప్పటి నుంచే క్రికెటర్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఆర్థికంగా స్థిరపడని పరిస్థితుల్లోనూ, ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ముకుల్ ట్రైనింగ్ కోసం దూర ప్రాంతంలోని అకాడమీలో చేర్పించేందుకు తన ఇంటిని అమ్మేసి వచ్చిన డబ్బును పూర్తిగా వినియోగించారు. ఆ తర్వాత జీవనోపాధి కోసం హోటల్ వ్యాపారం ప్రారంభించి లోన్ తీసుకున్నా, ఆదాయం ఆశించినంతగా లేక వాయిదాలు చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో ఒక దశలో జైలుకూ వెళ్లాల్సి వచ్చినా, తన కుమారుడి భవిష్యత్తుపై నమ్మకం కోల్పోలేదు. ఈ పరిస్థితుల్లో బంధువులు కూడా దూరమయ్యారు. "నువ్వు నీ కొడుకుతో పాటు నీ జీవితాన్నే నాశనం చేస్తున్నావు" అని విమర్శలు చేసినా, దాలిప్ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆ మాటలే తనకు మరింత ధైర్యాన్ని ఇచ్చాయని, ముకుల్‌ను పెద్ద క్రికెటర్‌గా చూడాలనే సంకల్పాన్ని బలపరిచాయని చెప్పారు. తండ్రి కష్టాలను అర్థం చేసుకున్న ముకుల్, ఇప్పుడు ఐపీఎల్‌లో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన ప్రతిభను నిరూపిస్తున్నాడు. వేలల్లో కాదు, కోట్లలో పారితోషికం అందుకుంటున్న ఈ యువ ఆటగాడు, ముందుగా కుటుంబ అప్పులను తీర్చాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటికే ముకుల్ తన ఆటతో జట్టుకు విజయాలు అందిస్తూ కోచ్‌లు, మాజీ ఆటగాళ్ల ప్రశంసలు అందుకుంటున్నాడు. ఒత్తిడి పరిస్థితుల్లోనూ ధైర్యంగా ఆడే సామర్థ్యం అతన్ని ప్రత్యేకంగా నిలబెడుతోంది. భవిష్యత్తులో జాతీయ జట్టులో చోటు సంపాదించే అవకాశాలు కూడా అతని ముందు కనిపిస్తున్నాయి. తండ్రి చేసిన త్యాగాలు, తాను ఎదుర్కొన్న కష్టాలు ఎప్పటికీ మరిచిపోనని ముకుల్ పలుమార్లు చెప్పాడు. ఆ కష్టాలే తనను మరింత బలంగా తీర్చిదిద్దాయని, ఇంకా పెద్ద స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో కష్టపడుతున్నానని వెల్లడించాడు. ఇప్పుడు అతని ప్రయాణం కష్టాల నుంచి విజయానికి ఎలా ఎదగాలో చూపించే స్ఫూర్తిదాయక కథగా నిలుస్తోంది.

## హార్దిక్ పాండ్యా జంటపై బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, సినిమా డెస్క్ :**




బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ పూనమ్ పాండే మరోసారి తన వ్యాఖ్యలతో వివాదానికి తెరలేపింది. తాజాగా క్రికెటర్ హార్దిక్ పాండ్యా, మహికా శర్మ జంటపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. హార్దిక్ పాండ్యా ప్రతిభావంతుడైన క్రికెటర్ అని పేర్కొన్న ఆమె, అతని వ్యక్తిగత జీవితంపై తీవ్ర విమర్శలు చేసింది. మహికా శర్మతో అతని సంబంధంపై సందేహాలు వ్యక్తం చేస్తూ, పెళ్లికాకముందే ఖరీదైన గిఫ్ట్‌లు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇద్దరూ మ్యాచ్‌ల సమయంలో ప్రవర్తించే తీరు కూడా సరైంది కాదని పూనమ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రతి మ్యాచ్‌కు హాజరై హార్దిక్‌పై ప్రభావం చూపుతున్నారని ఆరోపించింది. ఇప్పటికే పూనమ్ పాండే వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. గతంలో చేసిన ప్రకటనలతో విమర్శలు ఎదుర్కొన్న ఆమె, ఇప్పుడు మరోసారి ఈ వ్యాఖ్యలతో చర్చకు దారి తీసింది.



## ధోనీ రాకపై సంకేతాలు


- **సీఎస్‌కే అభిమానులకు శుభవార్త**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

గాయం కారణంగా ఇప్పటివరకు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న ఎంఎస్ ధోనీ త్వరలోనే జట్టులోకి రానున్నారనే వార్తలు చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఊరట కలిగిస్తున్నాయి. కాలిపిక్క గాయం వల్ల గత మూడు మ్యాచ్‌లకు దూరమైన ధోనీ లేకపోవడంతో సీఎస్‌కే వరుసగా రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల చేతిలో ఓటములు చవిచూసింది. ధోనీ ఇప్పటికే నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ ప్రారంభించినట్లు సమాచారం. ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఏప్రిల్ 14న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. మైదానంలోకి దిగే ముందు ధోనీకి ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించనున్నారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కే అవకాశం ఉంది. ధోనీ రాకతో సీఎస్‌కే మళ్లీ విజయపథంలోకి వస్తుందా అనే ఆసక్తి నెలకొంది.

## మ్యాచ్ మధ్యలో లవర్స్ ఫైట్.. ఈడెన్ గార్డెన్స్‌లో హంగామా

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం లక్నో, కేకేఆర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు అద్భుతంగా రాణించి మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముకుల్ చౌదరి కీలక అర్ధ సెంచరీతో జట్టును గెలిపించాడు. అయితే మ్యాచ్ కంటే ఎక్కువగా స్టేడియంలో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ సమయంలో ఓ యువ జంట మధ్య గొడవ చెలరేగింది. వీడియోలో కనిపించినట్లుగా, ఒక యువకుడు తన ప్రేయసిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో యువతి కూడా వెనక్కి తగ్గకుండా ప్రతిస్పందించింది. మాటల తూటాలు మాత్రమే కాకుండా, ఇద్దరూ ఒకరినొకరు తోసుకుంటూ దాడికి దిగినట్లు కనిపించింది. కొంతసేపటి తర్వాత శాంతించినట్లే కనిపించిన ఈ జంట, మళ్లీ తగువుకు దిగడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటనను అక్కడున్న వారు వీడియోగా చిత్రీకరించగా, అది ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. "మ్యాచ్‌ని ఆస్వాదించకుండా ఇలాంటి గొడవలేంటి?" అని కొందరు కామెంట్ చేస్తుండగా, "వైరల్ కావాలనే ఇలా చేస్తున్నారు" అంటూ మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు.




## గ్రీన్‌పై ట్రోలింగ్ మోత

- **చౌదరి ఇన్నింగ్స్‌తో పోలికలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

భారీ అంచనాలతో మినీ వేలంలో రూ.25.20 కోట్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసిన కామెరూన్ గ్రీన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేకపోతున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన మ్యాచ్‌లలో అతడి ప్రదర్శన నిరాశపరచడంతో అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లఖ్‌నవూతో జరిగిన తాజా మ్యాచ్‌లో గ్రీన్ రెండు ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ మాత్రమే తీసి 28 పరుగులు ఇచ్చాడు. అతడి ఎకానమీ రేటు కూడా ఎక్కువగా ఉండటంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదే మ్యాచ్‌లో తక్కువ ధరకు జట్టులోకి వచ్చిన ముకుల్ చౌదరి అద్భుతంగా ఆడి లఖ్‌నవూకు విజయం అందించడంతో పోలికలు మరింత పెరిగాయి. సోషల్ మీడియాలో గ్రీన్‌పై ట్రోలింగ్ మోత మోగుతోంది. "పాతిక కోట్ల ప్లేయర్ కంటే రూ.2.60 కోట్ల ప్లేయర్ బెటర్‌గా ఆడుతున్నాడు" అంటూ నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే జట్టులో ఎక్కువ కాలం నిలవలేవని కూడా ఎద్దేవా చేస్తున్నారు. మరోవైపు జట్టు ప్రదర్శన ప్రభావం ప్రేక్షకులపై కూడా పడుతోంది. సాధారణంగా అభిమానులతో కిటకిటలాడే కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం ఈసారి మాత్రం ఖాళీగా కనిపిస్తోంది. లఖ్‌నవూతో మ్యాచ్ సందర్భంగా సగం కూడా స్టేడియం నిండకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. సొంత మైదానంలో వరుస పరాజయాలు, నిరాశాజనక ప్రదర్శన కారణంగా అభిమానుల్లో ఆసక్తి తగ్గినట్లు కనిపిస్తోంది. ఐపీఎల్‌లో మూడు టైటిళ్లు గెలిచిన జట్టు మ్యాచ్‌కే ప్రేక్షకులు దూరంగా ఉండటం, ప్రస్తుత జట్టు పరిస్థితిని స్పష్టంగా చూపిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



యవ్వనంగాఉండాలంటే
సమతుల్య ఆహారం తీసుకోండి
పోషకాహారం శరీరానికి
అవసరమైన అన్ని పోషకాలను
అందిస్తుంది.ఇది అంతర్గత
ఆరోగ్యాన్ని కాపాడి యవ్వనాన్ని
నిలబెడుతుంది.






# డిస్ట్రిబ్యూటర్లు హ్యాపీగా ఉండేలా చూసుకుంటాను..

'రాకాస' బ్లాక్ బస్టర్ డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్‌లో నిహారిక కొణిదెల

**ముద్ర సినిమా డెస్క్ :**

'రాకాస' చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ, తాను చేసే ప్రతి సినిమా ద్వారా డిస్ట్రిబ్యూటర్లు సంతృప్తిగా ఉండేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రేక్షకులు చూపిన ఆదరణ వల్లే ఈ సినిమా పెద్ద హిట్ అయిందని ఆమె అన్నారు.డిస్ట్రిబ్యూటర్ మైత్రి రవి మాట్లాడుతూ, నిహారిక నిర్మించిన సినిమాలు ముందుకూడా తామే డిస్ట్రిబ్యూట్ చేయాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. నటుడు సంగీత్ శోభన్ 'రాకాస' విజయానికి డిస్ట్రిబ్యూటర్ల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ, టీమ్ చేసిన ప్రమోషన్స్ వల్లే ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి సినిమాను విజయవంతం చేశారని అభిప్రాయపడ్డారు.దర్శకుడు మానస శర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ సహా పలువురు డిస్ట్రిబ్యూటర్లు కూడా సినిమా విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించిన 'రాకాస' చిత్రం ప్రస్తుతం రెండో వారంలోనూ మంచి కలెక్షన్లతో కొనసాగుతోంది.

# టాలీవుడ్ ప్రేక్షకులకు 'రాకాస' మేకర్స్ బంపర్ ఆఫర్

**ముద్ర, సినిమా డెస్క్ :**





పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానపై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ కలిసి నిర్మించిన 'రాకాస' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను పొందుతోంది. మానస శర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఏప్రిల్ 3న విడుదలైన ఈ సినిమా విడుదలైన తొలి రోజుల నుంచే పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విభిన్నమైన ప్రమోషన్ విధానాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్‌సీస్‌లో కూడా మంచి వసూళ్లను రాబడుతోంది. ఇప్పటికే బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించడంలో విజయవంతమైంది. ఇక తాజాగా మేకర్స్ ప్రేక్షకులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'రాకాస' టికెట్ ధరను కేవలం రూ.100గా నిర్ణయించారు. ఈ నిర్ణయంతో సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువ కానుంది. ముఖ్యంగా సాధారణ ప్రేక్షకులు, కుటుంబాలు థియేటర్లకు రావడానికి ఇది మంచి అవకాశం అవుతోంది. సినిమాలోని కామెడీ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంగీత్ శోభన్, గెటప్ శ్రీను ట్రాక్ ప్రేక్షకులను బాగా అలరిస్తోంది. అలాగే వెన్నెల కిషోర్ తన కామెడీ టైమింగ్‌తో నవ్వులు పూయిస్తున్నాడు. దీంతో ఈ వేసవిలో కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా 'రాకాస' నిలుస్తోంది. నిర్మాతగా నిహారిక కొణిదెల మరోసారి తన ప్రతిభను నిరూపించారు. 'కమిటీ కుర్రోళ్లు' తరువాత 'రాకాస'తో మరో విజయాన్ని అందుకుని ఇండస్ట్రీలో తన స్థానాన్ని బలపరుచుకున్నారు. దర్శకుడు మానస శర్మ టేకింగ్‌తో పాటు మొత్తం టీమ్ పనితీరుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆ భావన నాలో బలంగా ఉంది

## నోరా ఫతేహి

**ముద్ర, సినిమా డెస్క్ :**

బాలీవుడ్ నటి నోరా ఫతేహి తన వ్యక్తిగత జీవితంపై ఓ పాడ్‌కాస్ట్‌లో ఓపెన్‌గా మాట్లాడారు. చిన్నతనంలో తండ్రి దూరమవ్వడం తనపై గాఢమైన మానసిక ప్రభావం చూపిందని ఆమె వెల్లడించారు. "ఎవరైనా నన్ను వదిలి వెళ్లిపోతారనే భయం నాలో చాలా బలంగా ఉంది. ఒక రిలేషన్ ముగిసినప్పుడు దాన్ని అంగీకరించడం నాకు చాలా కష్టం అవుతుంది" అని ఆమె చెప్పుకొచ్చారు. గతంలో సరైన వ్యక్తి కాకపోయినా, ఆ భయంతో సంబంధాలను కొనసాగించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ భావోద్వేగాలన్నీ తన బాల్య అనుభవాల ఫలితమని చెప్పిన నోరా, ప్రస్తుతం ఆ మానసిక సమస్యల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నానని స్పష్టం చేశారు.





# బాలయ్య పెద్ద మనసు..

## చిన్నారి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి

**ముద్ర, సినిమా డెస్క్ :**

రీల్ లైఫ్‌లో స్టార్ హీరోగా పేరు సంపాదించిన నందమూరి బాలకృష్ణ, రియల్ లైఫ్‌లో కూడా తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. హిందూపురం నియోజకవర్గానికి చెందిన ఓ చిన్నారి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలుసుకున్న వెంటనే స్పందించారు. లేపాక్షి గ్రామానికి చెందిన నటరాజు దంపతుల కుమారుడు కేయాన్ష్ అద్విక్ (2.5 సంవత్సరాలు) 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ టైప్ 2' అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధికి అవసరమైన ఇంజెక్షన్ విదేశాల నుంచి తెప్పించాల్సి ఉండగా, దాని ఖర్చు సుమారు రూ.16 కోట్లు కావడం ఆ కుటుంబానికి భారంగా మారింది. ఈ పరిస్థితిని తెలుసుకున్న బాలకృష్ణ తనవంతు సహాయం అందిస్తానని చెప్పడంతో పాటు, ప్రభుత్వ సహాయం కోసం కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సామాన్య ప్రజలు, అభిమానులు ముందుకు వచ్చి ఆ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు తోడ్పడాలని కోరారు. "మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ స్పందించి సహాయం చేయాలి" అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టు ప్రస్తుతం నెటిజన్లను కదిలిస్తూ విస్తృతంగా పంచబడుతోంది.



# తిరుమల శ్రీవారి సన్నిధిలో శ్రీలీల..

**ముద్ర, సినిమా డెస్క్ :**

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే భారీ క్రేజ్ సంపాదించుకున్న హీరోయిన్ శ్రీలీల తాజాగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. తన తాజా చిత్రాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్వామివారి ఆశీస్సులు తీసుకుంది. ఈ సందర్భంగా శ్రీలీల సంప్రదాయ దుస్తుల్లో ఎంతో సౌమ్యంగా, భక్తి భావంతో కనిపించింది. ఆమెను చూసిన భక్తులు, అభిమానులు ఒక్కసారిగా గుమికూడి దర్శనం కోసం ఆసక్తి చూపారు. శ్రీలీల తిరుమల పర్యటనకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె లుక్‌కు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తూ, సినిమాల్లోనే కాదు భక్తి విషయంలో కూడా ఆమె ప్రత్యేకతను చాటుకుందని కామెంట్లు చేస్తున్నారు.

# కృతి.. అందాలతో పోగొడుతుంది మతి

**ముద్ర, సినిమా డెస్క్** : యంగ్ బ్యూటీ కృతి శెట్టి మరోసారి తన గ్లామర్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజా ఫోటోల్లో ఆమె స్టైలిష్ లుక్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. బటర్ యెల్లో షేడ్‌లో ఉన్న మిడీ డ్రెస్ ధరించిన కృతి ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. కార్సెట్ డిజైన్‌తో రూపొందించిన ఈ డ్రెస్ ఆమె ఫిగర్‌ను హైలైట్ చేస్తూ, లుక్‌కు ప్రత్యేక అందాన్ని తెచ్చింది. సింపుల్ స్టైలింగ్ ఉన్నప్పటికీ, క్లాసీ టచ్‌తో కృతి మరింత ఎలిగెంట్‌గా మెరిసింది. సన్నని స్ట్రాప్స్, నెక్ వద్ద ఉన్న టైఅప్ డీటెయిల్స్ ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. అలాగే ఫ్లోయింగ్ స్కర్ట్‌తో ఉన్న స్లిట్ డిజైన్ ఆమెకు స్టైలిష్ మరియు కాన్ఫిడెంట్ అపియరెన్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. అందం మాత్రమే కాకుండా తన నటనతో కూడా కృతి ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. ఒక్కో ఇండస్ట్రీలో తన స్థానాన్ని బలపరుచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ హీరోయిన్, ఇప్పుడు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాతో తమిళ ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమవుతోంది



# లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'

## రివ్యూ: ఐడియా ఓకే కానీ..

ప్రస్తుతం ఇండియన్ సినిమా ఇండస్ట్రీ కొత్త పుంతలు తొక్కుతుంది. డిఫరెంట్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సక్సెస్ లను సాధిస్తున్నారు. ముఖ్యంగా యంగ్ హీరోలైతే ప్రేక్షకులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని సినిమాలను ఓకే చేసుకుంటున్నారు. అయిన ప్రదీప్ రంగనాథన్ వరుసగా మూడు సక్సెస్ లతో హ్యాట్రిక్ విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఇప్పుడు 'ఎల్ఐకే' సినిమాతో మరోసారి ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇక ఈ సినిమా ఎలా ఉంది సగటు ప్రేక్షకులను మెప్పించిందా? లేదా అనే విషయాన్ని మనం ఒకసారి తెలుసుకుందాం...

**కథ**

2040 వ సంవత్సరంలో ప్రేమ ఎలా ఉంటుంది. అప్పుడు ప్రేమికులు ప్రేమలో ఓడిపోతే వాళ్లకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఉంటుంది. ఈ కంపెనీ కి సీఈఓ గా ఎస్ జే సూర్య ఉంటాడు. ఇక ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి ప్రేమించుకుంటారు. పీకల్లోతు ప్రేమ లో ఉన్న వీళ్ళు ఎందుకు విడిపోవాల్సి వచ్చింది. ఆ ఇన్స్యూరెన్స్ కంపెనీ వల్ల వాళ్లకు కలిగిన లాభం ఏంటి? ఫైనల్ గా వీళ్లిద్దరు కలిశారా లేదా అనేది తెలియాలంటే మీరు ఈ సినిమా చూడాల్సిందే...

**విశ్లేషణ**

దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ సినిమాలో ఫ్యూచర్ జనరేషన్ ఎలా ఉండబోతుందో కండ్లకు కట్టినట్టుగా చూపించాడు. ముఖ్యంగా ప్రదీప్ రంగనాథన్ హీరోయిన్ కృతి శెట్టి క్యారెక్టర్లను మలిచిన విధానం కూడా చాలా బాగుంది. మంచి ప్రేమికుడు ఎలా ఉంటున్నాడు అనే దానికి 2040 వ సంవత్సరంలో ప్రేమికులు ఎలా ఉండబోతున్నారనే దాని మీద చాలా బాగా రీసెర్చ్ చేసి మరి ఆయన ఈ సినిమా చేశాడు. ఇక మొదటి సీన్ లోనే ఈ సినిమాకు సంబంధించిన విజన్ అర్థమైపోతుంది... సినిమాలోని కీలకమైన సన్నివేశాలను చాలా బాగా హ్యాండిల్ చేసిన విఘ్నేష్ శివన్ ఫస్టాఫ్ లో కొంతవరకు తడబడ్డాడు. అయినప్పటికి సెకండాఫ్ లో చాలా క్లారిటిని మెయింటైన్ చేస్తూ ముందుకు సాగాడు. ముఖ్యంగా ఆయన సినిమాల్లో ఒక కోర్ ఎమోషన్ అయితే సినిమా మొత్తాన్ని రన్ చేస్తూ ఉంటుంది. ఇక ఈ సినిమాలో కూడా అదే పాటర్న్ ఫాలో అవుతూ ముందుకు దూసుకెళ్లాడు... ఇక దానికి తోడుగా ప్రదీప్ రంగనాథన్ చేసే కామెడీ ఎపిసోడ్స్ బాగున్నాయి. ప్రదీప్ ఎస్ జే సూర్య మధ్య వచ్చే సన్నివేశాలు, హీరో హీరోయిన్ మధ్య లవ్ సీన్స్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంగేజ్ చేశాయి. ఇక సెకండాఫ్ లో ఒక కోర్ ఎమోషన్ మీద సాగే సన్నివేశాలు సైతం ప్రేక్షకుడిని రక్తం కట్టించాయి. ఓవరాల్ గా ఈ సినిమాను దర్శకుడు బాగా హ్యాండిల్ చేశాడనే చెప్పాలి... క్లైమాక్స్ సన్నివేశం కొంతవరకు డల్ అయింది. రొటీన్ రెగ్యులర్ గానే అనిపించింది. ఇలాంటి డిఫరెంట్ కాన్సెప్ట్ ఎంచుకున్నప్పుడు దాన్ని కూడా కొంచెం కొత్తగా రాసుకొని ఉంటే సినిమా మీద ఇంపాక్ట్ ఇంకాస్త ఎక్కువగా ఉండేది...

**ఆర్టిస్టుల పర్ఫామెన్స్**

ప్రదీప్ రంగనాథన్ గత సినిమాల మాదిరిగానే ఈ మూవీలో చాలా ఇంటెన్స్ యాక్టింగ్ చేశాడు. 'లవ్ టుడే' సినిమాలో ఎలాగైతే హ్యూమర్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడో ఈ మూవీలో అలాంటి సన్నివేశాలను చాలా ఈజ్ తో చేశాడు... కృతి శెట్టి సైతం హీరో పాత్రకి చాలా బాగా సపోర్ట్ చేసింది. ముఖ్యంగా తన పాత్రకి చాలా ఇంపార్టెన్స్ ఉండడంతో తను కూడా చాలా బాగా నటించింది... ఎస్ జె సూర్య ఇంతకుముందు చేసిన అన్ని సినిమాల కంటే కూడా ఇందులో వైవిధ్యభరితమైన నటనని చూపించాడు. ముఖ్యంగా ఆయన కొన్ని కామెడీ సీన్స్ లో చాలా బాగా యాక్టింగ్ చేశాడు. దానికి తోడుగా ఎమోషనల్ సన్నివేశాల్లో కూడా ఆయన చాలా బాగా నటించి మెప్పించాడు... ఇక మిగిలిన నటీనటులందరూ వల్ల పాత్ర పరిధి మేరకు ఓకే అనిపించారు...

**టెక్నికల్ అంశాలు...**

అనిరుధ్ అందించిన మ్యూజిక్ ఈ సినిమాకి చాలా వరకు ప్లస్ అయిందనే చెప్పాలి. ముఖ్యంగా బ్యాక్గ్రౌండ్ స్కోర్ విషయంలో ఆయన చాలా బాగా కేర్ఫుల్ గా వ్యవహరించాడు. సాంగ్స్ కూడా ఈ సినిమాకి హైలెట్ అయ్యాయి. అనిరుద్ ఈ సినిమాకి తన మ్యూజిక్ తో ప్రాణం పోశాడు... సినిమాటోగ్రఫీ కూడా 2040వ సంవత్సరంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయి. ఎలాంటి లొకేషన్స్ ఉంటాయి వాటన్నింటిని కెమెరాలో చాలా బాగా బంధించారు. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా బాగున్నాయి...

**ఈ సినిమాలో బాగున్నవి...**

ప్రదీప్ రంగనాథన్, ఎస్ జే సూర్య యాక్టింగ్
కథ
ఎమోషనల్ సీన్స్

**ఈ మూవీలో బాగోలేనివి**

రొటీన్ క్లైమాక్స్
ఫస్టాఫ్ కొంచెం లాగ్ అయింది...

**రేటింగ్ : 2.5/5**

**చివరి లైన్ : వీలైతే ఫ్యామిలీ తో కలిసి ఒకసారి చూడవచ్చు...**

**–అజయ్ యాదవ్, ముద్ర**

# డెకాయిట్ రివ్యూ

## ఓకే అనిపించే థ్రిల్లర్




వైవిధ్యమైన థ్రిల్లర్ సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న అడివి శేష్, ఈసారి డెకాయిట్ అనే లవ్, యాక్షన్ మేళవించిన ఒక థ్రిల్లర్ తో మన ముందుకు వచ్చాడు. గతంలో క్షణం, గూఢచారి, మేజర్ వంటి హిట్లతో మంచి ఊపుమీదున్న శేష్, రూట్ మార్చి చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించగలిగింది? గత చిత్రాల తరహాలోనే ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిందా లేదా అనేది రివ్యూలో చూద్దాం. K. హరి దాస్ (అడివి శేష్), సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్) ఒకరినొకరు ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించుకుంటారు. వారిద్దరూ పెళ్లి చేసుకుని కలకాలం హాయిగా జీవించాలని అనుకున్న సమయంలో ఒక నేరం జరగడం, తదనంతర పరిణామాల్లో సరస్వతి ఇచ్చిన సాక్ష్యం వల్ల హరి 13 ఏళ్ల పాటు హరి జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. తన జీవితాన్ని నాశనం చేసిన ప్రియురాలిపై పగ తీర్చుకోవడమే లక్ష్యంగా హరి జైలు నుంచి తప్పించుకుని బైటకి వస్తాడు. అప్పటికే జూలియట్ మరొకరిని పెళ్లి చేసుకొని ఉంటుంది. అంతే కాకుండా జూలియట్ ఒక పెద్ద ఆపదలో ఉంటుంది. పగ తీర్చుకోవాలని జైలు నుంచి బైటికొచ్చిన హరి నిజంగా పగ తీర్చుకున్నాడా? లేక జూలియట్ గురించి అసలు నిజం తెలుసుకున్నాడా? చివరికి ఏమైంది అనేది మిగతా కథ.

సినిమాలో ఫస్ట్ హాఫ్ అంతా జైలు నుంచి తప్పించుకోవడం, హీరో బ్యాక్ స్టోరీని రివీల్ చేయడంతో ఆసక్తికరంగానే సాగుతుంది. అయితే సెకండ్ హాఫ్ లో కథనం నెమ్మదించడం సినిమాకి మైనస్. క్లైమాక్స్ లో వచ్చే ఎమోషనల్ టర్న్ కొంతమేరకు ఈ మైనస్ లను కవర్ చేసినా ప్రేక్షకులకు అద్భుతమైన సినిమా చూశామనే తృప్తిని మాత్రం ఇవ్వలేకపోయింది. కథ కంటే ఎక్కువగా స్పీడ్ ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ తో సినిమాను నడిపించే ప్రయత్నం జరిగింది. దీనివల్ల ప్రేక్షకులు కొంతమేరకు ఎంగేజ్ అయినప్పటికీ సినిమా అంతా అయిపోయిన తర్వాత చూసుకుంటే మాత్రం ఓస్ ఇంతేనా అనే నిట్టూర్పు కలగక మానదు. నిజానికి ఈ సినిమా లవ్, క్రైమ్ ఆనే రెండు జోనర్లు మిక్స్ చేసి థ్రిల్లర్ గా ప్రెజెంట్ చేసిన కిచిడీ ఆనే చెప్పాలి. కొన్ని ఎపిసోడ్స్ లో, ముఖ్యంగా దోపిడీ ఎపిసోడ్స్, క్లైమాక్స్ లో సినిమాటిక్ లిబర్టీ ఎక్కువే తీసుకున్నారు. అలా అని సినిమా నీరసంగా ఉందా అంటే అదేమీ లేదు కానీ అడివి శేష్ సినిమా నుంచి అద్భుతం ఆశించే వారికి మాత్రం నిరుత్సాహం తప్పదు.

అడివి శేష్ సినిమాలంటే సహజంగా స్క్రీన్‌ప్లేలో మ్యాజిక్ తో చివరివరకూ ప్రేక్షకులను ఊపిరి బిగబట్టేలా చేసేవే. ఈ సినిమాను కూడా దర్శకుడు షానీల్ దేవ్ టెక్నికల్ గా సినిమాను చాలా హై స్టాండర్డ్స్ లో ప్రజెంట్ చేశాడు. సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. రైటింగ్ విషయానికి వస్తే కథ గొప్పగా లేనప్పటికీ స్క్రీన్ ప్లే తో మ్యాజిక్ చేయాలని చేసిన ప్రయత్నం కొంతమేరకే సఫలం అయింది. డైలాగ్స్ మాత్రం క్రిస్ప్ గా ట్రెండీగా ఉన్నాయి. పాటలు యావరేజ్ గానే ఉన్నాయి కానీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రం చాలా సీన్స్ ను ఎలివేట్ చేసింది. దానికి తగ్గట్టుగా సినిమాటోగ్రఫీ, స్పీడ్ ఎడిటింగ్ సినిమాకు ట్రెండీనెస్ తీసుకొచ్చాయి. నటీనటుల విషయానికి వస్తే హరిదాస్ పాత్రలో అడివి శేష్ సులువుగానే చేసుకుంటూ పోయాడు. రాయలసీమ యాస కొంతవరకూ నప్పింది కానీ పూర్తి మార్కులు అయితే వెయ్యలేం. యాక్షన్ సీన్స్ లో మాత్రం చెలరేగిపోయాడు.. ఇక మృణాల్ ఠాకూర్ తన నటనతో ఆకట్టుకుంది. నటుడిగా మారిన బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా తనదైన ముద్ర వేయగా, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి తమ పాత్రల పరిధి మేరకు మెప్పించారు.

**సినిమాలో బాగోలేనివి ఇవీ..**

1. వీక్ అయిన సెకండ్ హాఫ్
2. దోపిడీల విషయంలో ఎక్కువైన సినిమాటిక్ లిబర్టీ

**ఇందులో ఏం బాగున్నాయో తెలుసా?**

1. అడివి శేష్, మృణాల్ ఠాకూర్, అనురాగ్ కశ్యప్ ల పర్ఫార్మెన్స్
2. యాక్షన్ ఎపిసోడ్స్
3. నేపథ్య సంగీతం

**రేటింగ్: 2.5/5**

**ఫైనల్ వర్డ్: ప్రేమ ఎక్కువైంది.. థ్రిల్ తగ్గింది!**

**– నరేష్, ముద్ర**

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com